ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.60 (310.8498)	54,656	54,656
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.60 (4.09)	1,968.62	2,866.18
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.292 (43.1584)	35,800	17,000

చికెన్ ధరలు	లైవ్ : రూ.120	డ్రెస్ : రూ.200	స్కిన్‌లెస్ : రూ.220

దసరాకైనా జీతాలు వచ్చేనా?

- ఆరు నెలలుగా రాని మోడల్ స్కూల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు
- ఉమ్మడి జిల్లాలో రూ.కోటి 24 లక్షలకు పైగా బకాయిలు



ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలలుగా జీతాలు నిలిచిపోయాయి. నెల నెలా వేతనం వస్తుంటేనే పెరిగిన నిత్యావసరాల ధరలతో కుటుంబాలను వెళ్లదీయడం కష్టమవుతోంది. ఈ తరుణంలో ఆరు నెలలుగా వేతనాలు అందక కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని 33 స్కూళ్లకు సంబంధించి సుమారు రూ.కోటి 24 లక్షలకు పైగా వేతనాలు బకాయి ఉన్నాయి.

మొత్తం 132 మంది అవుట్‌సోర్సింగ్ కింద పనిచేస్తుండగా అందులో ఫిజికల్ డైరెక్టర్‌తో పాటు ఆపరేటర్, అటెండర్, నైట్‌వాచ్‌మన్‌లు ఉన్నారు. ఈ నెలలోనే ప్రధాన పండుగైన దసరా ఉండగా ఆనాటికైనా వేతనాలు అందకపోతాయా అని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఒకవేళ వేతనాలు ఆలస్యం చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

- వివరాలు 6వ పేజీలో

కొనసాగిన గణేష్ నిమజ్జనాలు

- రెండోరోజూ కోలాహలం నడుమ శోభాయాత్రలు
- జిల్లా వ్యాప్తంగా పూర్తయిన నిమజ్జనాలు



జిల్లాలో గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా వినాయక ప్రతిమలకు నిమజ్జన కార్యక్రమాలు శనివారం కూడా కొనసాగాయి. ఆదివారం చంద్రగ్రహణం ఉండటంతో ప్రతిష్ఠించిన ప్రతీ విగ్రహాన్ని నిర్వాహకులు తప్పనిపరిస్థితుల్లో నిమజ్జనం చేశారు. అంతకుముందు అందంగా అలంకరించిన వాహనాల్లో స్వామి వారి ప్రతిమలను అధిష్ఠింపజేసి శోభాయాత్రను ప్రారంభించారు. నృత్యాలు, మేళతాళాలు, బ్యాండ్ వాయిద్యాల సందడి మధ్య శోభాయాత్ర సాగింది. స్థానిక చెరువులతో పాటు జిల్లా కేంద్రంలో వల్లభరావు చెరువు, 14వ మైలు వద్ద కృష్ణానదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

- వివరాలు 8వ పేజీలో

అవే బారులు .. అవే బాధలు

- యూరియా కోసం పాట్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బారులు తీరిన రైతులు



యూరియా వచ్చిందని తెలియడంతో శాలిగౌరారం మండలంలో పీఏసీఎస్ వద్ద గుమికూడిన రైతులు

యూరియా కోసం రైతుల కష్టాలు తీరేట్లు లేవు. శనివారం కూడా సహకార సంఘాల వద్ద రైతులు బారులు తీరారు. తెల్లవారుజాము నుంచే పీఏసీఎస్‌ల వద్దకు చేరుకుంటున్నారు. సాగుకు తగ్గట్టుగా యూరియా అందించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు పీఏసీఎస్‌ల వద్ద చెప్పులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు క్యూలైన్లలో ఉంచి యూరియా కోసం పడిగాపులు పడ్డారు. నిడమనూరులో రైతుల గంటలకొద్దీ క్యూలైన్లలో నిల్చోగా రెండు బస్తాల చొప్పున యూరియా ఇచ్చేందుకు టోకెన్లు ఇచ్చారు. పోలీసుల పహారా నడుమ 200 మంది రైతులకు మాత్రమే యూరియా అందజేశారు. శాలిగౌరారం, కట్టంగూరు, వేములపల్లి, చండూరు, మునుగోడు మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మహిళలు చంటిపిల్లలతో వచ్చి పీఏసీఎస్‌ల వద్ద తెల్లవారుజాము నుంచే పడిగాపులు కాశారు.

- వివరాలు 7వ పేజీలో

పరిషత్ ఓటర్ల సవరణ షురూ

పరిషత్ ఎన్నికల ఓటర్ల జాబితా సవరణకు జిల్లా ఎన్నికల అధికారులు ముసాయిదా జాబితా విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించిన షెడ్యూల్ మేరకు శనివారం ఎంపీటీసీ స్థానాలకు జిల్లాలోని గుర్తించిన 1,956 పోలింగ్ కేంద్రాల వద్ద, జడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాలను 33 మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



- ముసాయిదా విడుదలచేసిన అధికారులు
- 1,956 పోలింగ్ కేంద్రాలు, 10.73లక్షల మంది ఓటర్లు
- 10న తుదిజాబితా ప్రచురణ

తాజాగా, విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 33 జడ్పీటీసీ స్థానాలు, 33 ఎంపీపీ స్థానాలతో పాటు, 353 ఎంపీటీసీ స్థానాలను ప్రకటించారు. అదేవిధంగా మొత్తం 1,956 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించగా, 10,73,506 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లా ఎన్నికల అధికారి నేతృత్వంలో సోమవారం జిల్లా స్థాయిలో, అన్ని మండలాల్లో మండల పరిషత్ అధికారుల నేతృత్వంలో మండల స్థాయిల్లో రాజకీయ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం వరకు ముసాయిదా జాబితాలపై సూచనలు, అభ్యంతరాలు తీసుకుంటారు. ఈనెల 9న వాటిని పరిశీలించి పరిష్కరిస్తారు. 10వ తేదీన పోలింగ్ కేంద్రాల వారీగా తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి వెల్లడిస్తారు.

33 జడ్పీటీసీ, ఎంపీపీ, 353 ఎంపీటీసీ స్థానాలు

రాష్ట్రంలోనే పెద్ద జిల్లా అయిన నల్లగొండలో 33 మండల పరిషత్‌లతో పాటు, 33 జడ్పీటీసీ స్థానాలు, 353ఎంపీటీసీ స్థానాలను అధికారులు ఖరారు చేశారు. మొత్తం 1,956 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించారు. కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా 2016లో నూతనంగా అడవిదేవులపల్లి, కొండమల్లేపల్లి, మాడుగులపల్లి, నేరేడుగొమ్ము, తిరుమలగిరి(సాగర్) మండల పరిషత్‌లు ఏర్పాటవగా, 2019 పరిషత్ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా వీటిని కలుపుకొని 31 జడ్పీటీసీ స్థానాలు, 31మండల పరిషత్‌లతో పాటు, 352 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. తాజాగా,గట్టుప్పల్, గుడిపల్లి మండలాలు నూతనంగా ఏర్పాటవగా, అక్కడ కూడా మండల పరిషత్‌లను ఏర్పాటు చేశారు. వాటితో కలిపి 33జడ్పీటీసీ స్థానాలు, 33 మండల పరిషత్‌లలో 353 ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేశారు. అత్యధికంగా మిర్యాలగూడ మండల పరిషత్‌లో 19 ఎంపీటీసీ స్థానాలు ఉండగా,అత్యల్పంగా అడవిదేవులపల్లి, గట్టుప్పల్, గుడిపల్లి మండలాల్లో ఐదేసి చొప్పున ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.

ప్రాథమిక కసరత్తు పూర్తి...

జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ప్రాథమిక కసరత్తు పూర్తయింది. పోలింగ్ కేంద్రాలను గుర్తించడంతో పాటు, పోలింగ్ స్టేషన్ల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితాలు ఖరారు చేశారు. పోలింగ్ సిబ్బందిని సైతం గుర్తించి శిక్షణ ఇచ్చారు. పార్టీల పరంగానే ఈ స్థానాలకు ఎన్నికలు జరగనుండడంతో అందుకు అవసరమైన పోలింగ్ బాక్స్‌లు, బ్యాలెట్ పత్రాలను సైతం అందుబాటులో ఉంచారు. ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించిన మరుక్షణం నిర్వహణలోకి దిగేందుకు వీలుగా పంచాయతీరాజ్‌శాఖ సన్నద్ధమైంది. మరోవైపు అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీల ద్వితీయ, క్షేత్రస్థాయి నాయకులు సైతం రిజర్వేషన్లపై ఆసక్తిగా ఉన్నారు.

రిజర్వేషన్ల కోసం ఎదురుచూపు...

పరిషత్ ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుండగా, రాజకీయ నాయకులు రిజర్వేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఈ ఎన్నికల్లో బీసీ వర్గాలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు జీవో విడుదల చేసిన తక్షణమే రిజర్వేషన్ల కోటా, స్థానాలు...

- మిగతా 8వ పేజీలో...

గ్రామ పాలనాధికారులు పనిపై శ్రద్ధ చూపాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలనాధికారులు పనిపై శ్రద్ధ వహించి విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన గ్రామ పాలనాధికారుల కౌన్సిలింగ్‌లో ఆమె మాట్లాడారు. ఉత్తర్వులు అందుకున్న వారు సోమవారం నాటికి విధుల్లో చేరాలన్నారు. అభ్యర్థులందరి సమక్షంలోనే ఖాళీల జాబితా ప్రదర్శిస్తూ వారి ఐచ్ఛికాల మేరకు పోస్టింగులు కేటాయించామన్నారు.

అధిక సంఖ్యలో దరఖాస్తులు తీసుకోవాలి

జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఎక్కువ దరఖాస్తులు స్వీకరించేందుకు దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఇప్పటి వరకు 6,000 దరఖాస్తులను ప్రభుత్వానికి పంపామని, మరో నాలుగు వేల దరఖాస్తులను పంపించాలన్నారు. గడిచిన ఏడెనిమిది ఏళ్లలో జిల్లాలో 42,000 మందికి పైగా మృతిచెందారన్నారు. వారి కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సహాయం అందేలా అధికారులు దృష్టిసారించాలన్నారు. జాతీయ కుటుంబం ప్రయోజన పథకం కింద లబ్ధి చేకూర్చేందుకు బాగా కృషి చేసిన ఆర్డీవోలు, నలుగురు తహసీల్దార్లు, నలుగురు ఎంపీడీవోలు, నలుగురు పంచాయతీ కార్యదర్శులను 13న సన్మానించనున్నట్లు చెప్పారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితాలపై ఈ నెల 8వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి, 9న పరిష్కారం, 10న తుది జాబితా ప్రచురించాలన్నారు.



కనగల్ మండలం తేలకంటిగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చండూరు కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి నేలపై కూర్చొని భోజనం చేస్తున్న కలెక్టర్

ఇందిరమ్మ ఇళ్లను సిద్ధం చేయాలి

(ఆంధ్రజ్యోతి, కనగల్): ఇందిరమ్మ ఇళ్ల పనులను త్వరగా పూర్తిచేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం మండలంలోని తేలకంటిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పనులను ఆమె పరిశీలించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి 83 ఇళ్లు మంజూరు చేయగా ఐదిళ్ల పనులు దాదాపు పూర్తయ్యాయని, మరో 18 ఇళ్లు స్లాబ్ దశలో ఉన్నాయని అధికారులు వివరించారు. అనంతరం కనగల్ పీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆమె వెంట ఆర్డీవో అశోక్‌రెడ్డి, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో సుమలత, వైద్యాధికారి గాదరి రామకృష్ణ, ఎంపీవో వీరబాబు, హౌసింగ్ ఏఈవో వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ప్రయోజనం కలగాలి

(ఆంధ్రజ్యోతి, చండూరు): అర్హత కలిగిన కుటుంబాలకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ప్రయోజనం కలగాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం చండూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీచేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఆమె వెంట ఆర్డీవో శ్రీదేవి, ఎంపీడీవో యాదగిరి, మునిసిపల్ కమిషనర్ మల్లేశం, తదితరులు ఉన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ షమీం అక్తర్

చిన్నారులు కష్టపడి చదివాలి

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీం అక్తర్

నల్లగొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు కష్టపడి చదివి జీవితంలో మంచి స్థానంలోకి రావాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీం అక్తర్ అన్నారు. శనివారం పానగల్‌లో ఉన్న చారుమతి చైల్డ్‌కేర్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. అక్కడి చిన్నారులను ఉద్దేశించి మాట్లాడుతూ జీవితం సంఘర్షణలతో కూడుకున్నదని, ప్రతీ ఒక్కరు కష్టపడి చదివితేనే ముందుకు వెళ్తారన్నారు. పిల్లలు చదువుకునేందుకు ప్రభుత్వం పలు అవకాశాలు, సౌకర్యాలను కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గొప్పవారు కావాలనే పట్టుదల, సంకల్పంతో చదువుకోవాలని, వారి భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో గజాల అజూం అక్తర్, సీడబ్ల్యూసీ చైర్మన్ కృష్ణ, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, చారుమతి చైల్డ్‌కేర్ సెంటర్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగసేనారెడ్డి, అనంతరెడ్డి, కట్ట వెంకట్‌రెడ్డి, వెంకన్న, డీసీపీవో గణేష్, సీడీపీవో నిర్మల, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

నేడు చెర్వుగట్టు ఆలయం మూసివేత

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7న రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని మూసివేస్తున్నట్లు ఈవో సిరికొండ నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం స్వామివారికి నివేదన అనంతరం ద్వారబంధం చేస్తామని తిరిగి సోమవారం సంప్రోక్షణ అనంతరం ఆలయాన్ని తెరిచి భక్తులకు దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని విమర్శిస్తే సహించేది లేదు

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండరూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని, మంత్రిని విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి విమర్శించారు. నల్లగొండ పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ నిమజ్జనం రోజు 1వ నెంబర్ వినాయక విగ్రహం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడితో పాటు మాజీ ఎమ్మెల్యే వ్యవహరించిన తీరు సరిగా లేదన్నారు. వారిద్దరి దిగజారుడు రాజకీయాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉత్సవ కమిటీ ఆహ్వానంతో నిమజ్జనం రోజు 1వ నెంబర్ విగ్రహం వద్దకు వచ్చి మాట్లాడుతుండగా, వేదికపై పిలవలేదనే అక్కసుతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి ఘర్షణ వాతావరణం సృష్టించాడని ఆరోపించారు. ఆయనకు కనీస రాజకీయ అవగాహన లేదని, ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు జరుగుతుంటే జీర్ణించుకోలేక ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నారని అన్నారు. ఆయన్ను పోలీసులు అక్కడి నుంచి తరలించారే తప్ప అరెస్టు చేయలేదన్నారు. అనంతరం అక్కడికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కావాలని రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నించారని విమర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్‌మెన్ల కోసం ఇలా ఘర్షణ పడి కాంగ్రెస్ నాయకులతో దాడులు చేయించుకోవాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే నోటి దురుసు వల్లే గత ఎన్నికల్లో ప్రజలు ఓడించారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. రెండు మూడు పార్టీలు మారిన వ్యక్తి కూడా యూరియాపై చిల్లర రాజకీయాలు చేస్తున్నాడని, స్థాయిని మించి విమర్శలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ఎక్కడా లేని విధంగా నల్లగొండలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పొత్తు ఉందని ధ్వజమెత్తారు. గణేష్ నిమజ్జనం రోజు నల్లగొండలో జరిగిన సంఘటనే నిదర్శనమన్నారు. రాజకీయ లబ్ధికోసం బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత కత్తుల కోటి, రోడ్డు రవాణా సంస్థ కమిటీ సభ్యుడు కుసుకుంట్ల రాజిరెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప, నాయకులు బొజ్జ శంకర్, సురిగి వెంకన్నగౌడ్, మామిడి కార్తీక్, గాలి నాగరాజు, కంచర్ల ఆనంద్‌రెడ్డి, ఇటికాల శ్రీనివాస్, పిల్లి యాదగిరి, పాండు, సుజాత, స్వరూపరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుమ్ముల మోహన్‌రెడ్డి

పన్నుల భారం తగ్గించిన మోదీ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాగం, తదితరులు

నల్లగొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల ప్రయోజనం కోసం నిత్యావసర సరుకులపై ప్రధానమంత్రి మోదీ పన్నుల భారం తగ్గించడం హర్షణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిత్యావసర సరుకులు, ఆహార పదార్థాలపై భారీగా పన్నులను తగ్గించారన్నారు. అంత్యోదయ యోజన సిద్ధాంతానికి అనుగుణంగా పనిచేస్తున్నారన్నారు. మోదీ పన్నుల భారం తగ్గించి ప్రజలకు పండుగ కానుక ఇస్తే కాంగ్రెస్ పార్టీ మాత్రం దీంతో దేశం నష్టపోతుదనడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్రశేఖర్, నల్లగొండ పార్లమెంటు కన్వీనర్ బండారు ప్రసాద్, నాయకులు లింగస్వామి, విద్యాసాగర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేశం, మహేష్, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, కిషన్, జగ్జీవన్, శివరామకృష్ణ, బలరాం, మదు, శాంతి స్వరూప్, నీరజ, తారా, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం

పల్లా దేవేందర్‌రెడ్డి

దేవరకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు చేస్తోందని సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం దేవరకొండ మార్కెట్ యార్డులో ఎరువుల దుకాణాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ కార్మికులకు 15శాతం రేట్లు పెంచేందుకు ఫర్టిలైజర్స్ యజమానులు అంగీకరించినట్లు తెలిపారు. రెండేళ్లకోసారి హమాలీ రేట్లు పెంచాలన్నారు. ఎగుమతి, దిగుమతి హమాలీ రేట్లతోపాటు గ్రూపు ఇన్స్‌రెన్స్ సౌకర్యం, సంవత్సరానికి రెండు జతల దుస్తులు ఇవ్వాలని కోరగా, అందుకు యజమానులు అంగీకరించినట్టు తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, దాచేపల్లి రమేష్, నీల రవి, హమాలీ యూనియన్ నాయకులు నీల వెంకటయ్య, కృష్ణయ్య, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

కొనసాగిన నిమజ్జనాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం గణేష్ నిమజ్జనాలు కొనసాగాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువులో, మఠంపల్లి సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనాలు చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని వల్లభరావు చెరువు, హాలియా సమీపంలోని సాగర్ ఎడమకాల్వలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. అంతకుముందు శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు.


కేతేపల్లి మండలంలోని మూసీ రిజర్వాయర్‌లో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు


కొండమల్లేపల్లిలో గణనాథుని శోభాయాత్ర


నార్కట్‌పల్లి మండల కేంద్రంలో శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న భక్తులు


యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులో చిన్నగణేష్ విగ్రహాన్ని చిన్నారులు రిమోట్ కారులో తీసుకెళ్లి పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

వెలుగులో విఘ్నరాజు


యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని భువనగిరిలో వీధిలైట్లు వెలగకపోవడంతో శోభాయాత్ర చీకట్లో కొనసాగింది. అయితే వాహనాలపై ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల వెలుగులో విఘ్నరాజులు అందరినీ ఆకర్షించారు.

నాలో నేను...


యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలోని పెద్దచెరువులో శనివారం నిమజ్జనం చేసిన ఓ వినాయక విగ్రహం సగం మునిగింది. నీటిలోని ప్రతిబింబంతో ఆ స్వామి లీనమైనట్లు కనిపించింది.

భువనగిరి శోభాయాత్రలో స్వల్ప ఉద్రిక్తత



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు, రాస్తారోకో చేస్తున్న భక్తులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):భువనగిరి గణేష్ నిమజ్జన శోభాయాత్ర స్వల్ప ఉద్రిక్తకు దారి తీసింది. శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభమైన శోభాయాత్ర గంజ్ మార్గంలో ప్రశాంతంగా సాగినప్పటికీ ఆబాది ప్రాంతంలో మాత్రం ధర్నాలు, లాఠీచార్జీలు, నిరసనలు నడుమ శనివారం ఉదయం వరకు కొనసాగింది. కొందరి అత్యుత్సాహంతో శోభాయాత్ర ఆలస్యానికి కారణమయ్యారని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తాతనగర్‌కు చెందిన ఓ మండపం నిర్వాహకులు శోభాయాత్రలో వినియోగిస్తున్న డీజేను నియంత్రించే క్రమంలో ఓ యువ పోలీస్‌అధికారి డీజేను పగులగొట్టాడని ఆరోపిస్తూ నిర్వాహకులు రాస్తారోకోకు దిగారు. సమద్‌చౌరస్తా నుంచి ఆజాద్‌రోడ్డు గుండా సాగుతున్న ఊరేగింపును వేగవంతం చేయాలని తిరిగి ఆ యువపోలీస్ అధికారి నేతృత్వంలోనే ప్రత్యేక బలగాలు లాఠీచార్జ్ చేశాయి. మరోమారు ఉద్రిక్తతకు దారితీసి శోభాయాత్ర శకటాలతో శనివారం తెల్లవారుజామున జగ్జీవన్‌రామ్‌చౌరస్తా వద్ద భక్తులు ఆందోళనకు దిగారు.డీసీపీ అక్షాంశ్‌యాదవ్, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ తదితర అధికారులు బందోబస్తును పర్యవేక్షించారు. భువనగిరి పెద్ద చెరువు, రాయిగిరి చెరువుల్లో కలిపి మొత్తం 402 విగ్రహాలను నిమజ్జనం చేశారు.

డిండి రిజర్వాయర్‌లో మత్స్యకారుడి మృతి

డిండి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా డిండి రిజర్వాయర్‌లో మునిగి ఓ మత్స్యకారుడు శనివారం మృతి చెందాడు. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం డిండి గ్రామానికి చెందిన మత్స్యకారుడు మేకల మల్లయ్య(48) శనివారం డిండి రిజర్వాయర్‌లో చేపలను పట్టేందుకు వెళ్లాడు. చేపలకు వలవేస్తున్న క్రమంలో తెప్ప నుంచి జారిపడి వలలో చిక్కుకొని నీట మునిగి మృతి చెందాడు. రిజర్వాయర్ ఒడ్డున చెప్పులు ఉండటంతో పాటు తెప్ప ఒడ్డుకు కొట్టుకువచ్చింది. చుట్టుపక్కల ఉన్న మత్స్యకారులు అనుమానించి వెతకగా తాను వేసిన వలలోనే మల్లయ్య చిక్కుకొని మృతి కనిపించాడు. మల్లయ్యకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మల్లయ్య భార్య సుల్తానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


మల్లయ్య (ఫైల్‌ఫొటో)

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొని ఒకరు..

చిట్యాల రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా పెద్దదేవి మండలం గంగన్నగూడెం గ్రామానికి చెందిన నార్ల భానుప్రసాద్(50) కుమారుడు నరేంద్ర హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కుమారుడిని కలవడంతో పాటు విదేశాలకు వెళ్తున్న బంధువు సామాగ్రిని తీసుకువచ్చేందుకు ఓ గూడ్స్ వాహనంలో డ్రైవర్ల నార్ల ఫణికుమార్, నార్ల భానుప్రసాద్, రమేష్‌బాబు, లక్ష్మిలతో కలిసి బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న వాహనం వేకువజామున 4 గంటలకు విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులోని మలుపు వద్దకు చేరుకోగానే నిలిపి వేసి ఉన్న లారీని చూసి డ్రైవర్ ఫణికుమార్ సడన్ బ్రేక్ వేశాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న విజయవాడలోని ఆటోనగర్‌కు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ వాసంశెట్టి బాలదుర్గ మల్లేశ్వరరావు బస్సును కుడివైపునకు మళ్లించాడు. బస్సు వెనకాలే వస్తున్న కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పడంతో ముందున్న గూడ్స్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో అందులోని నలుగురికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవర్ పక్కన కూర్చున్న భానుప్రసాద్ మృతి చెందినట్లు తెలిపారు. ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. భానుప్రసాద్ కుమారుడు నరేంద్ర ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది వివాహిత ఆత్మహత్య

కట్టంగూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరులో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామానికి చెందిన పొలగోని యాదయ్య, జయమ్మ దంపతులకు చెందిన చిన్నకుమార్తె లక్ష్మిని కట్టంగూరుకు చెందిన పెద్ది యాదయ్య కుమారుడు సైదులుకు 2009లో ఇచ్చి పెళ్లిచేశారు. కొన్నేళ్ల పాటు కాపురం సజావుగా సాగింది. ఆరునెలల నుంచి సైదులు ఏపనిచేయకుండా మద్యానికి బానిసై తిరుగుండటంతో భార్య లక్ష్మి కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. పెద్దమనుషులతో సైదులుకు చెప్పించినా మార్పురాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 5న ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఇంట్లో ఉరివేసుకుంది. కొద్దిసేపటికి వచ్చిన భర్త సైదులు చూసి కిందికి దింపారు. కొన ఊపిరితో ఉన్న లక్ష్మిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని తెలిపారు. మృతిపై ఎటువంటి అనుమానం లేదని లక్ష్మి తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

డీసీఎం ఢీకొని వ్యక్తికి గాయాలు

వలిగొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నిలిపి ఉన్న గ్యాస్ బండిని డీసీఎం ఢీకొన్న ఘటనలో డెలివరీ బాయ్‌కి గాయాలయ్యాయి. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం గొల్నేపల్లికి చెందిన వంశీ ఒక ప్రైవేట్ గ్యాస్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం వాహనం పార్క్ చేసి ఉండగా ఎదురుగా వచ్చిన డీసీఎం వాహనం డ్రైవర్ అజాగ్రత్తతో వాహనం నడుపుతూ గ్యాస్ ఆటోను ఢీకొట్టింది. అక్కడే పార్క్ చేసిన మరో మూడు ద్విచక్ర వాహనాలు కూడా దెబ్బతిన్నాయి. డెలివరీ బాయ్‌కి గాయాలు కాగా స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స జరిపించారు.

నకిలీపత్రాలతో ఇసుక అక్రమ రవాణా



పట్టుకున్న లారీతో సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అటవీ, మైనింగ్ శాఖలకు సంబంధించిన పత్రాలతో పాటు రబ్బరు స్టాంపులు సృష్టించి వాటితో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం తన కార్యాలయంలో వివరాలను విలేకరులకు సీఐ చరమందరాజు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు చెందిన లంకెల శ్రీనివాస రెడ్డి, డ్రైవర్ రాంబాబులు అటవీ, మైనింగ్ శాఖలకు చెందిన పత్రాలతో పాటు రబ్బరు స్టాంపులు తయారు చేసి ఇసుక తరలింపునకు అనుమతులు ఇస్తున్నట్లు పత్రాలను తయారు చేశారు. వాటి ద్వారా నందిగామ ప్రాంతంలోని ఐతవరం నుంచి సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలానికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. హుజూర్‌నగర్‌లో శనివారం పోలీసులు సాధారణ తనిఖీల్లో చేపట్టారు. ఈ క్రమంలో ఇసుక లోడుతో వెళ్తున్న లారీని ఆపి విచారించారు. విచారణలో ప్రభుత్వ శాఖలకు సంబంధించి రబ్బరు స్టాంపులు తయారుచేసి వాటి ద్వారా దొంగ పత్రాలు సృష్టించి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించినట్లు సీఐ తెలిపారు. కొంతకాలంగా ఈ తతంగం జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దసరాకైనా జీతాలు వచ్చేనా?

మోడల్ స్కూల్స్‌లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు మెరుగైన సేవలు ఇవ్వాలనేది ప్రభుత్వం ఉద్దేశ్యం. అందుకు విద్యార్థుల బోధనకు రెగ్యులర్ టీచర్లను తీసుకోగా, విద్యార్థుల ఆటలు, భద్రత, పాఠశాల రోజు వారీ కార్యక్రమాల కోసం నాన్‌టీచింగ్(అవుట్‌సోర్సింగ్ ద్వారా) ఉద్యోగులను తీసుకుంది. అంతవరకు బాగానే ఉన్నా వారికి జీతాలు ఇవ్వక ఆరు నెలలు. నెలనెలా జీతం ఒకటిన రాకుంటేనే ఇబ్బందులు ఎదురయ్యే క్రమంలో కొన్నినెలలుగా జీతాలు అందక కుటుంబాలను ఎలా పోషించుకోవాలనో అర్థం కావడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-కోదాడ)



- ఆరు నెలలుగా రాని మోడల్ స్కూల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు
- కుటుంబాలు ఎలా గడుస్తాయని ఆవేదన
- రెగ్యులర్ ఉద్యోగుల తరహాలో జీతాలు ఇవ్వాలని డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో రూ.కోటి 24 లక్షలకు పైగా బకాయిలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 33 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. వాటిలో పనిచేస్తున్న 132 మందికి ఆరు నెలలుగా రూ.కోటి 24 లక్షల 74 వేల వేతనాలు అందాల్సి ఉంది. నిత్యావసరాలను, పిల్లల చదువులు, వైద్యఖర్చులు, రోజు వారీ సాధారణ ఖర్చులను సైతం జీతాలు రాకపోవటంతో భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిలో సగం నెలలు జీతాలు రాకుంటే ఎలా పనిచేయాలని వాపోతున్నారు. ఇదిలా ఉంటే జీతాలు ఏజెన్సీ ద్వారా అందించటం తలనొప్పిగా మారిందంటున్నారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి, కార్పొరేషన్ ఏర్పాటు చేసి నెలనెలా జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. వారంలో జీతాలు విడుదల చేయకపోతే ఆందోళన చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 33 మోడల్ స్కూల్స్..

ఉమ్మడి జిల్లాలో 33 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో విద్యార్థుల ఆటలు ఆడిచేందుకు ఒక ఫిజికల్ డైరెక్టర్, పాఠశాలకు సంబంధించిన వివరాలను పొందుపరిచేందుకు డేటాఎంట్రీ ఆపరేటర్, పాఠశాలలో రోజు వారి కార్యక్రమాల నిర్వహణకు అటెండర్, రాత్రి వేళ విద్యార్థుల భద్రత కోసం నైట్‌వాచ్‌మన్‌ను నాన్ టీచింగ్ కింద నలుగురు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం తీసుకుంది. ఆ చొప్పున 33 పాఠశాలలో మొత్తంగా 132 మందిని నియమించింది. వీరికి ప్రతీ పాఠశాల నుంచి నెలకు రూ 63వేలు వస్తుంది. ఆ చొప్పున 33పాఠశాలలో పనిచేస్తున్న 132మందికి నెలకు రూ.20.79 లక్షలు కాగా ఆరు నెలలకు రూ.కోటి 24లక్షలు 74వేలు జీతం బకాయి ఉందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. దసరా పండుగనాటికైనా జీతాలు వస్తాయా అని ఎదురుచూస్తున్నారు.

ఉద్యోగి	వేతనం
ఫిజికల్ డైరెక్టర్	రూ.20వేలు
ఆపరేటర్	రూ.17వేలు
అటెండర్	రూ.13వేలు
వాచ్‌మన్	రూ.13వేలు
మొత్తం	రూ.63 వేలు

జీతం రాకుంటే ఎలా పనిచేయాలి



ఆరు నెలలుగా జీతం రాకుంటే ఎలా పనిచేయాలి. నెలనెలా వస్తేనే కుటుంబం నడవటం కష్టం. అటువంటిది ఆరు నెలలుగా జీతం ఇవ్వకుంటే ఏంచేయాలి. అప్పులు తెచ్చి కుటుంబాన్ని నడుపుతున్నాం. వచ్చే జీతంలో సగం వడ్డీలకే పోతోంది. నిత్యావసరాలు కొనాలన్నా ఇబ్బందిపడుతున్నాం. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వచ్చే జీతమే తక్కువ. అందులోనే ప్రభుత్వం జీతం నెలల తరబడి ఇవ్వకుంటే, ఉద్యోగి కుటుంబం ఎలా నడుస్తుంది. ప్రభుత్వం అర్థం చేసుకొని ఉద్యోగుల జీతాలు వెంటనే విడుదల చేయాలి. నెలనెలా రెగ్యులర్ ఉద్యోగుల తరహాలో మా జీతాలు కూడా మొదటివారంలో పడేలా చూడాలి.

- జాన్‌పాషా, ఫిజికల్ డైరెక్టర్

మిర్యాలగూడలో హోటల్‌లో నగదు చోరీ



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు, కౌంటర్‌ను ధ్వంసం చేసిన దుండగుడు

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని వైష్ణవి గ్రాండ్ హోటల్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సుమారు రూ.80లక్షల నగదు చోరీకి గురైంది. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రాజశేఖరరాజు శనివారం పరిశీలించారు. అనంతరం చోరీ జరిగిన తీరును విలేకరులకు వివరించారు. హోటల్ నిర్వాహకుడు రావిరాల రవికుమార్ శుక్రవారం రాత్రి తన ఛాంబర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో గుర్తుతెలియని వ్యక్తి గ్రౌండ్ ఫ్లోర్ నుంచి లోపలికి ప్రవేశించి హోటల్ యజమాని ఛాంబర్‌గది తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించినట్లు సీసీ టీవీ పుటేజీలో నమోదైనట్లు డీఎస్పీ వెల్లడించారు. ఛాంబర్‌గదిలోని కౌంటర్‌ను పగులగొట్టి అందులో దాచిన సుమారు రూ.80లక్షల నగదును చోరీ చేశాడు. శనివారం ఉదయం హోటల్‌కు వచ్చిన యజమాని రవికుమార్ కౌంటర్ తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐలు నాగభూషణం, పీఎన్డీ ప్రసాద్ చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. సీసీటీవీ పుటేజీలను పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తి గదిలోకి ప్రవేశించి బ్యాగులో డబ్బు నింపుకొని వెళ్లినట్లుగా సీసీటీవీ పుటేజీల్లో గుర్తించామని డీఎస్పీ తెలిపారు. నల్లగొండ నుంచి క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి టెక్నికల్ సాక్ష్యాలను సేకరించారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని త్వరలోనే గుర్తించి పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. కాగా, హోటల్ యజమాని రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని రెండు ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దింపి దర్యాప్తు ముమ్మరం చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

గల్లంతైన తండ్రి మృతదేహం లభ్యం

వేములపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గణేష్ నిమజ్జనానికి వచ్చి నల్లగొండ జిల్లా వేములపల్లి వద్ద సాగర్ ఎడమకాల్వలో గల్లంతైన తండ్రీ, కుమారుల్లో తండ్రి మృతదేహం శనివారం లభ్యమైంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం గణేష్ నిమజ్జనానికి వచ్చిన మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్‌కు చెందిన తండ్రీ, కుమారులు సాంబయ్య, శివమణిలు ప్రమాదవశాత్తు వేములపల్లి సాగర్ ఎడమకాల్వలో గల్లంతయ్యారు. దీంతో ఎడమకాల్వ వెంట రెండు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టగా శనివారం సాయంత్రం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం మేడారం గ్రామ శివారులో తండ్రి సాంబయ్య మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించి భద్రపరిచామన్నారు. కాగా కుమారుడు శివమణి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

బంగారు గొలుసు దొంగల ముఠా అరెస్ట్

హాలియా, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా హాలియా పోలీసులు బంగారు గొలుసుల దొంగల ముఠాను అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు శనివారం విలేకరులకు విడుదల చేసిన ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఆగస్టు 27వ తేదీ సాయంత్రం అనుముల మండలం శ్రీనాథపురం స్టేజీ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని మూడు తులాల బంగారు పుస్తెలతాడును ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి బలవంతంగా లాక్కొని పరారయ్యారు. శనివారం హాలియా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్‌ఐ సాయిప్రశాంత్ ఆధ్వర్యంలో కొత్తపల్లి గ్రామశివారులో తనిఖీలు చేస్తున్న సమయంలో బాలాజీ రైస్‌మిల్ వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. వారు పెద్దవూర మండలం చలకుర్తి గ్రామానికి చెందిన కల్లూరి బ్రహ్మారెడ్డి, మూల మాధవరెడ్డిలుగా గుర్తించారు. వారు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. వారి నుంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడు, ద్విచక్రవాహనం, రెండు మొబైల్ ఫొన్లను స్వాధీనం చేసుకొని నిడమనూరు కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు ఛేదించడంలో హాలియా సీఐ సతీష్‌రెడ్డి పర్యవేక్షణలో ఎస్‌ఐ సాయిప్రశాంత్, నిడమనూరు ఎస్‌ఐ సురేష్‌లను అదేవిధంగా సిబ్బంది సురేష్, హరిప్రసాద్, వెంకటేశ్వర్లు, రమేష్‌గౌడ్, ఆఫీజ్, శివరాజు, రైటర్ కృష్ణమునిలను డీఎస్పీ అభినందించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్‌లో పేకాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన నక్క శ్రీనివాస్‌రెడ్డితో పాటు పోచంపల్లికి చెందిన పాలకుర్తి జంగయ్య, చెక్క నరేష్, సుధాకర్, మహేందర్, ప్రశాంత్, పాలకుర్ల ఉపేందర్‌లు శనివారం పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో వెళ్లి అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ. 25,570 నగదు, నాలుగు సెట్ల పేకాట ముక్కలు, 7 సెల్‌ఫోన్లను స్వాధీన చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

తాటిచెట్టుపై తలకిందులుగా

● రక్షించిన తోటి కార్మికులు


గీతకార్మికుడిని కాపాడుతున్న తోటి కార్మికులు

సంస్థాన్‌నారాయణపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):తాటిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారి తలకిందులుగా వేలాడిన ఓ గీత కార్మికుడిని పక్కనే ఉన్న తోటి కార్మికులు ప్రాణాలకు తెగించి కాపాడారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం జనగాం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కొండూరి చంద్రయ్య దినచర్యలో భాగంగా శనివారం ఉదయం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి కొంతభాగం కిందికి జారి తలకిందులుగా వేలాడాడు. ఈ విషయాన్ని సమీపంలోనే తాటి చెట్టు ఎక్కుతున్న తోటి గీత కార్మికులు గమనించారు. చెట్టుపై ప్రమాదవశాత్తు తలకిందులుగా వేలాడుతున్న చంద్రయ్యను రక్షించేందుకు గ్రామానికి చెందిన గీత కార్మికులు కొండూరి యాదయ్య, తలుపునూరి ఇస్తారి, కందుల లింగయ్యలు తమ ప్రాణాలకు తెగించి తాటి చెట్టు ఎక్కారు. తలకిందులుగా వేలాడుతున్న చంద్రయ్యను చెట్టుపైనే సరిచేసి ప్రాణాపాయం నుంచి రక్షించారు. అనంతరం అతడిని కిందికి దించారు. ఈ ప్రమాదంలో చంద్రయ్యకు ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం అని తెలిసినా ఆపదలో ఉన్న తోటి కార్మికుడిని రక్షించి ప్రాణాలు కాపాడిన గీత కార్మికులను ప్రజలు అభినందించారు.

అవే బారులు .. అవే బాధలు

» యూరియా కోసం ఉమ్మడి జిల్లా రైతుల అవస్థలు
» ఆశతో వస్తూ నిరాశగా వెళ్తున్న వైనం
» పోలీసుల పహారాలో విక్రయాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. తెల్లవారకముందే పనులు మానుకొని బస్తా యూరియా కోసం పరుగులు పెడుతున్నారు. కుటుంబ సమేతంగా వచ్చి సొసైటీ ఎదుట పడిగాపులు ఉం టున్నారు. వృద్ధులు, మహిళలు సైతం గంటల తరబడి క్యూలో నిల్చుంటున్నారు. కనీసం ఒక్క బస్తా అయినా దొరుకుతుందన్న ఆశతో వస్తూ క్యూలో నిలబడి నీరసించిపోతున్నారు. రోజంతా క్యూలైన్‌లో నిలుచున్నా దొరకకపోవడంతో నిరాశగా వెళ్తున్నారు. ఇప్పటికీ పోలీసుల పహారాలో యూరియా అమ్మకాలు చేయాల్సిన పరిస్థితి ఉంది.

– (ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


నిడమనూరు పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం రైతుల క్యూ

నిడమనూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు పీఏసీఎస్ కార్యాలయం ఎదుట యూరియా కోసం రైతులు గంటలకొద్దీ ఎదురు చూస్తున్నారు. సెలవు రోజుల్లోనూ సొసైటీ కార్యాలయం ఎదు ట నిరీక్షిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రా మాలకు చెందిన రైతులు శనివారం యూరియా కోసం పెద్ద సంఖ్యలో సింగిల్ విండో కార్యాలయం ఎదుట బారులు తీరారు. సొసైటీకి ఒక్కలోడు(444 బస్తాలు) మాత్రమే యూరియా వచ్చింది. రైతులు భారీగా క్యూలో ఉండటంతో వచ్చిన ఒక్క లోడు యూరియా ఏమూలకు సరిపోదు. దీంతో రైతులకు రెండు బస్తాల చొప్పున ఇచ్చేందుకు టోకెన్లు ఇచ్చారు. రైతులను అదుపు చేసేందుకు పోలీసుల పహారాలో యూరియాను విక్రయించారు. 200 మందికి మాత్రమే యూరియా దొరికింది. మిగిలిన అనేకమంది రైతులు నిరాశగా వెళ్లారు. వానాకాలం సీజన్‌లో గణనీయంగా సాగు పెరగడంతో రైతుల అవసరాల మేరకు మార్కెట్‌లో యూరియా దొరకడం లేదు. దీంతో రైతులు సొసైటీల వద్ద ట్రాక్టర్లు, ఆటోలతో నిరీక్షిస్తున్నారు. పైర్లకు యూరియా వేయాల్సిన తరుణం మించిపోతుండడంతో రైతులు యూరియా కోసం పరుగులు పెట్టాల్సి వస్తోంది.

అనంతగిరిలో స్వల్ప ఘర్షణ..

అనంతగిరి : మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం వద్ద రైతులు తెల్లవారుజాము నుంచి యూరియా ఇచ్చే కేంద్రాల వద్ద బారులు తీరారు. అయితే రైతుల మధ్య క్యూలైన్ విషయంలో మాట మాట పెరిగి స్వల్ప ఘర్షణకు దారి తీసింది. పోలీసులు వివాదం పెరగకుండా సర్ది చెప్పి సాధారణ పరిస్థితి తీసుకువచ్చారు. రైతులకు అవసరమైన యూ రియా సరఫరా సమయానికి అందుబాటులో లేకపోవడంతో ఉద్రిక్తతకు కారణం అని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు బస్తాల చొప్పున పంపిణీ..

శాలిగౌరారం : మండలంలో యూరియా కోసం రైతులు మూడు రోజులుగా కోసం రైతులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. శనివారం తెల్లవారుజామున శాలిగౌరారం ఆగ్రో సెంటర్‌కు 444 బస్తాలు, పెర్క కొండారంలోని ఆగ్రో సెంటర్‌కు 444 బస్తాల యూరియా లోడ్ వచ్చింది. శనివారం తెల్లవారుజాము నుంచే ఆగ్రో సెంటర్ల వద్ద రైతులతో పాటు మహిళలు కూడా పెద్ద ఎత్తున బారులు తీరారు. శాలిగౌరారం మండల ఏవో సౌమ్యశ్రుతి తన సిబ్బందితో టోకెన్‌ద్వారా రైతులకు రెండుబస్తాల చొప్పున పంపిణీ చేశారు.

● కట్టంగూరు : కట్టంగూరులోని రైతు వేదిక వద్ద శనివారం యూరియా టోకెన్ల కోసం తెల్లవారు జాము నుంచి క్యూలైన్‌లో నిలబడ్డారు. మం డలానికి 880 యూరియా బస్తాలు రాగా ఒక్కొక్క రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేసినట్లు ఏవో గిరి ప్రసాద్ తెలిపారు.

ఆందోళనలో అన్నదాత

వేములపల్లి : యూరియా కోసం అన్నదాతలకు ఆందోళన తప్పడం లేదు. వేకువజాము నుంచే క్యూలైన్‌లో చెప్పులు, ఆధార్‌కార్డులు పెట్టి వేచి ఉన్నప్పటికీ యూరియా అందకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. 15 రోజులుగా సల్కునూరు పీఏసీఎస్ కేంద్రానికి యూరియా సరఫరా కావ డం లేదు. దీంతో యూరియా కొరత సొసైటీ పరిధిలో తీవ్రంగా నెలకొంది. శనివారం యూరియా లారీ వస్తుందని సమాచారం అందడంతో సమీప గ్రా మాల నుంచి రైతులు వేకువ జాము నుంచే వందలాదిగా తరలి వచ్చారు. కాగా పీఏసీఎస్ కేంద్రానికి కేవలం 440 బస్తాలు మాత్రమే రావడంతో ఒక్కొక్క రైతుకు ఒక బస్తా యూరియాను పోలీసు పహారా మధ్య పంపిణీ చేయాల్సి వచ్చింది. దీంతో లైన్‌లో నిల్చొని ఉండి యూరియా దొరకని వందలాది రైతులు నిరాశతో వెనుదిరిగి వెళ్లారు. సొసైటీ పరిధిలో మొత్తం 16గ్రామాలు ఉండగా 4,500 మంది రైతులు సభ్యులు ఉన్నారు. సొసైటీ మొత్తానికి వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటికీ సుమారు 350 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. వరినాట్లు వేసి నెలరోజులు కావొస్తున్నప్పటికీ యూరియా చల్లకపోవడంతో వరికి పిలకలు రావడం లేదని, పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపి ఆర్థికంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సకాలంలో స్పందించి అవసరమైన యూ రియాను అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

●మఠంపల్లి : మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతులు తెల్లవారు జామ నుంచి క్యూలైన్‌లో ఉన్నారు. కొన్ని రోజులుగా సరిపడా యూరియా సరఫరా చేయకపోవడంతో శుక్రవారం సహకార సంఘం సీఈవోపై రైతులు ఎగపడ్డారు. తోపులాట చేసుకున్నారు. అనంతరం పోలీసులు యూరియా పంపిణీ చేపట్టారు.

● చండూరు : చండూరు పట్టణంలో సహకారం సంఘానికి యూరియా వస్తుందనే సమాచారంతో శనివారం ఉదయమే మహిళలు, రైతులు తమ ఆధార్‌కార్డులతో క్యూలైన్లో నిలబడ్డారు. అనంతరం పోలీసులు రైతులకు నచ్చజెప్పి ఇబ్బందులు కలగకుండా వరుస క్యూలైన్ ఏర్పాటు చేసి సజావుగా పంపిణీ చేశారు. ఒక్క రైతుకు ఎకరానికి రెండు బస్తాలు మాత్రమే పంపిణీ చేశారు.


వేములపల్లి: సల్కునూరు పీఏసీఎస్ కేంద్రం వద్ద చెప్పులను లైన్‌లో పెట్టిన రైతులు

● మునుగోడు : మునుగోడులో తెల్లవారుజాము నుంచి రైతులు బారులు తీరారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘానికి రెండు రోజుల క్రితం రెండు లారీల్లో 888బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న పరిసర గ్రామాల రైతులు శనివారం తెల్లవారుజాము నుంచే తరలివచ్చారు. కొందరు రైతులు సద్ది కట్టుకొని వచ్చారు. ఒంటరి మహిళలతో పాటు చంటి బిడ్డలతో వచ్చిన రైతులూ ఉన్నారు. ఆధార్ కార్డు ఆధారంగా భూమి విస్తీర్ణం బట్టి ఒక్కో రైతుకు రెండు, మూడు సంచుల యూరియా విక్రయించారు. కొంతమంది రైతులకు యూరియా అందక వెనుతిరిగారు.


మునుగోడులో చంటి బిడ్డతో వచ్చిన ఓ మహిళ

పోలీసుల పహారాలో పంపిణీ

మేళ్లచెర్వు : మండలంలోని మేళ్లచెర్వు, కందిబండ, పీఏసీఎస్ కేంద్రాల్లో యూరియా అందుబాటులో లేక పోవడంతో శుక్రవారం ఒక్కొక్క లారీ చొప్పున యూరియా బస్తాలు, పీఏసీఎస్ వచ్చాయని సమాచారం అందింది. దీంతో రైతులు, మహిళలు వేకువజాము నుంచి సొసైటీ కార్యాలయాల వద్ద బారులు తీరారు. పీఏసీఎస్ సిబ్బంది స్థానిక పోలీసుల సహకారంతో సొసైటీ కార్యాలయాలు తెరిపి పోలీసుల సహకారంతో యూరియా పంపకం, కేవలం ఒక్క రైతుకు రెండు కట్టల చొప్పున పంపిణీ చేశారు. అయితే వేలి ముద్రల నమోదు ప్రక్రియలో తీవ్ర జాప్యం కారణంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిల్వ ఉన్న కట్టల వరకు రైతులకు అందించారు. సొసైటీల్లో యూరియా అయి పోవడంతో క్యూలైన్లలో వేచి ఉన్న రైతులు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. మండలవ్యాప్తంగా 3,525 టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు కేవలం 800 టన్నుల యూరియా మాత్రమే సరఫరా అయినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రతిరోజు పీఏసీఎస్‌ల చుట్టూ యూరియా కోసం ప్రదక్షణలు చేస్తున్నప్పటికి అందుబాటులో ఉన్న కట్టలను ఒక్కొక్కరికి రెండు మాత్రమే ఇవ్వటంతో సొసైటీల వద్ద రైతులు బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

క్యూలైన్‌లో సొమ్మసిల్లిన మహిళా రైతు

మండలంలోని కప్పలకుంటతండాకు చెందిన బానోతు బుజ్జి శనివారం వేకువజాము నుంచి పీఏసీఎస్ నందు క్యూలైన్‌లో ఉండటం ఉదయం యూరియా ప్రారంభ సమయంలో ఒక్కసారిగా తోపులాట జరగింది. దీంతో తోటి రైతులు సపర్యలు చేశారు.


సొమ్మసిల్లిన బానోతు బుజ్జి

గంటల తరబడి క్యూలైన్‌లో..

కోదాడరూరల్ : యూరియా కోసం రైతులు గంటల తరబడి పనులన్నీ మానుకొని క్యూలైన్లో వేచి ఉంటూ అవస్థలు పడుతున్నారు. కోదాడ మం డలం రెరకుంట గ్రామంలో శనివారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. చిమిర్యాల సొసైటీ పరిధిలో సాగు విస్తీర్ణం ఎక్కువగా దొరకుంట గ్రామంలో ఉండగా నల్లబండ గూడెం, చిమిర్యాల గ్రామాల రైతులకు అధిక శాతం యూరియాను సరఫరా చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పెన్‌పహాడ్ : యూరియా కోసం రైతుల ఉదయం 5 గంటల నుంచే రైతులు క్యూ లైన్ కడుతున్నారు. ఒకరోజు ముందు రైతు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు ఇచ్చిన రైతులకు మరుసటి రోజు ఇస్తున్నారు. మ ండలంలోని నారాయణగూడెం, చీదేళ్ల పీఏసీఎస్‌లో ఉదయం 8 గంటల నుంచి రైతులు సాయంత్రం 5 గంటల వరకు వేచి ఉన్నా యూరియా దొరకని పరిస్థితి ఉంది. దీంతో యూరియా పంపిణీలో పోలీసు బందోబస్తు నడుమ యూరియా పంపిణీ చేస్తున్నారు. కాగా వచ్చిన యూరియాను రైతులకు సకాలంలో అందిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి అనిల్‌నాయక్ తెలిపారు. నారాయణగూడెం పీఏసీఎస్‌లో 666 బస్తాలు, చీదేళ్ల పీఏసీఎస్‌లో 222 బస్తాలను 520 మంది రైతులకు అందజేసినట్లు వెల్లడించారు. యూరియా అం దని రైతులకు సోమవారం పంపిణీ చేస్తామని తెలిపారు.

15న ఎంజీయూ స్నాతకోత్సవం

నల్లగొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నాలుగో స్నాతకోత్సవాన్ని ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విశ్వవిద్యాలయాల కులపతి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ఆచార్య డీఎస్ మూర్తి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ స్నాతకోత్సవంలో పీజీ విద్యార్థులకు 57 బంగారు పతకాలు, 22 పీహెచ్‌డీ పట్టాలను అందజేస్తామని పేర్కొన్నారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

నల్లగొండరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ)ఆధ్వర్యంలో సెప్టెంబరు 7న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్ధన్, సహాయ కార్యదర్శి నాగయ్య కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో శనివారం ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే వారి సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సింహ, నగేష్, పట్టణ నాయకులు వెంకన్న, సైదులు, శంకర్ పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారలను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి.


ఆలయ ముఖమండపంలో స్వామిఅమ్మవార్లకు హారతి నివేదిస్తున్న అర్చకుడు

నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

● మధ్యాహ్నం ఆలయం మూసివేత

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనుంది. ఈ నేపథ్యంలో ఆలయ వేళల్లో మార్పులు చేశారు. ఆదివారం రాత్రి 9.56 నుంచి 1.26గంటల వరకు ఉన్నందున ప్రధానాలయం, అనుబంధ, ఉప ఆలయాల్లో మధ్యాహ్నం 12గంటల లోపు నిత్య కైంకర్యాలు, నివేదనలు ఆలయ ప్రధానార్చక బృందం పూర్తి చేసిన అనంతరం ఆలయ ద్వార బంధనం చేస్తారు. కాగా, కొండ కింద ఆధ్యాత్మిక వాడల్లో సత్యదేవుడి వ్రతాలు ఉదయం రెండు (ఉదయం 7, 10 గంటలు) విడతల్లో నిర్వహించనుండగా మధ్యాహ్నం 12, సాయంత్రం 4గంటలకు రెండు విడతల్లో నిర్వహించాల్సిన వ్రతాలు, వాహన పూజలు, ఉభయ దర్శనాలు, సాయంత్రం బ్రేక్ దర్శనం, ఊరేగింపు సేవలు, అర్చన, ఆరాధన, శయనోత్సవ కైంకర్యాలను రద్దు చేశారు. తిరిగి సోమవారం వేకువజామున 3.30గంటలకు ఆలయాన్ని శుభ్రంచేసి సంప్రోక్షణ అనంతరం నిత్య కైంకర్యాలు నిర్వహించేందుకు ఆలయ వేళల్లో మార్పులు చేశారు. ఉదయం 9 నుంచి 10గంటలు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బ్రేక్ దర్శనాలు, ఉదయం 8.15గంటల నుంచి ఉభయ దర్శనాలు ప్రారంభించనున్నట్టు ఈవో ఎస్.వెంకట్రావ్ తెలిపారు. కాగా, వేకువజామున 3.30గంటలకు ఆలయం తెరచి సంప్రోక్షణ, తెల్లవారుజామున 5.30గంటలకు సుప్రభాతం, 6 గంటలకు బిందె తీర్థం, తిరువారాధన, 6.30 నుంచి 7గంటల వరకు బాలభోగం, 7 నుంచి 7.45గంటల వరకు నిజాభిషేకం, 7.45 నుంచి 8.15గంటల వరకు సహస్రనామార్చన, 7.45 నుంచి 9.30గంటల వరకు సుదర్శన నారసింహ హోమం, 10.15గంటలకు స్వామివారి నిత్య కల్యాణం ప్రారంభిస్తారు.

స్వామి నామస్మరణ చేయాలి

చంద్రగ్రహణం నేపథ్యంలో భక్తులు లక్ష్మీనరసింహ స్వామివారి నామస్మరణ చేయాలి. దీంతో సకల పాపాలు తొలగి మోక్ష ప్రాప్తి కలుగుతుంది. ఎలాంటి కీడు జరగకుండా దోష నివారణకు స్వామి ధ్యానం, నృసింహ, లక్ష్మీదేవి మూల మంత్రం జపించడం ఎంతో శ్రేయస్కరం. ఆదిఆరం మూసివేసిన ఆలయాన్ని మరుసటి రోజు తెరుస్తాం.

- కాండూరి వెంకటాచార్యులు, యాదగిరిగుట్ట దేవస్థాన ప్రధానార్చకుడు

బీసీ గురుకుల పాఠశాల సందర్శన

నాగార్జునసాగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో బీసీ గురుకుల పాఠశాలను గురుకుల విద్యాలయాల జాయింట్ సెక్రటరీ శ్యాంప్రసాద్ లాల్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బీసీ గురుకుల వసతి గృహాలను పరిశీలించారు. అనంతరం ఆయన బీసీ గురుకుల పాఠశాల విద్యా ర్థులతో మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించడమే గురుకులాల లక్ష్యం అన్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తుందని దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు 24 గంటలు ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు రవికుమార్, మాధవిలత ఏపీటీపీలు సంతోష్, సరిత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బీసీ గురుకుల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న శ్యాంప్రసాద్

మూసీకి నిలకడగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుంది. ఎగువ నుంచి 1968.62 ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్టు 2, 8 నెంబరు క్రస్టుగేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 2277.30 క్యూసెక్కులు వరద నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టి ఇన్‌ఫ్లో నిలకడగా వస్తున్న నేపథ్యంలో ప్రాజెక్టు నీటిమట్టాన్ని 643.60 అడుగులు (4.09టీఎంసీ)ల వద్ద నిలకడగా ఉండేలా చూస్తూ అదనపు నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమకాల్వల ద్వారా ఆయకట్టుకు 528.66 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645 అడుగులు (4.46టీఎంసీ)ల నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.60అడుగులు(4.09టీఎంసీ)లుగా ఉంది.

ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు వనం లక్ష్మీపతి ఎంపిక

నల్లగొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ పూల్ విభాగానికి రాష్ట్రస్థాయి టోర్నమెంట్లకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో ఈ నెల 9, 10వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే పోటీల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా స్పోర్ట్స్ నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


వనం లక్ష్మీపతి

రూ.1500 కోట్లతో రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మునుగోడు నియోజకవర్గంలో రోడ్లను సమూలంగా అభివృద్ధి చేసి రూపు రేఖలు మార్పు చేయాలన్న లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శనివారం ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతో పాటు సంబంధిత కాంట్రాక్టర్లతో రోడ్ల నిర్మాణాలపై సమీక్షించారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి కోసం ఇప్పటివరకు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలు సంబంధించి రూ.1500కోట్ల నిధులతో పనులు జరుగుతున్నాయని వివరించారు. ఇంకా రూ.1500కోట్ల నిధుల మంజూరు కోసం కార్యాచరణ ప్రణాళికతో ప్రతిపాదనలు తయారు చేసి పంపుతున్నట్లు తెలిపారు. దీంతో రోడ్ల సమస్య తీరనుందని, ప్రజల రాకపోకలు సజావుగా సాగనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, కొత్తగా నిర్మించే రోడ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నిర్మాణంలో ఎక్కడ ఎలాంటి తప్పులు చోటుచేసుకోవద్దని ఆదేశించారు.


అధికారులు, కాంట్రాక్టర్లతో రోడ్ల నిర్మాణాలపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నాణ్యమైన భోజనం అందించాలి : రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ: విద్యార్థులకు పెట్టే భోజనంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆదర్శ బాలికల జూనియర్ కళాశాల వసతిగృహం, వంట గదులను, బాత్రూంలను, కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సొంత నిధులైన రూ.1.20కోట్లతో నిర్మిస్తున్న తొమ్మిది తరగతులకు సంబంధించిన అదనపు నూతన గదుల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అంతకుముందు ఆదర్శ బాలికల వసతి గృహంలో మౌలిక వసతులు, ఆట స్థలాలను ఆయన పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాకు జ్వరం వస్తే చూసుకోవడానికి నర్సు లేదని, ఫిల్టర్ వాటర్ లేదని విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తీసికెళ్లారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ నెలరోజులలోనే మీ సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూను తప్పనిసరిగా పాటించాలని వార్డెన్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేష్ గౌడ్‌కు సూచించారు. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల అదనపు తరగతుల గదులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఆయన వెంట ఎంఈవో బిట్టు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జ్యోతి, వెంకటేష్‌గౌడ్, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మాల్ వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ నక్క శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు, పాల్వాయి అనిల్‌రెడ్డి, పాశం సురేందర్‌రెడ్డి, మేతరి యాదయ్య, పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, నాయకులు వెన్నమనేని రవీందర్‌రావు, వెంకటంపేట బాలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మెండు రెడ్డి, అజిత్‌రెడ్డి, శ్రీశైలం, రామకృష్ణ, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గంజాయి విక్రేతల అరెస్టు

● ఆరుగురు వ్యక్తుల నుంచి కిలోకు పైగా గంజాయి స్వాధీనం

మిర్యాలగూడఅర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను నల్లగొండజిల్లా మిర్యాలగూడ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ నాగభూషణం తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన సొంగద్‌కుమార్‌సింగ్, కరణ్‌కుమార్ అనే వ్యక్తులు పట్టణ సమీపంలోని రైస్‌మిల్లులో హమాలీ కార్మికులుగా పనిచేస్తున్నారు. తమ స్వస్థలమైన బీహార్ రాష్ట్రంలోని ఖగారియా గ్రామంలోని తమ ఇంటికి వెళ్లి తిరిగొచ్చే క్రమంలో అక్రమంగా గంజాయిని తరలించి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సదరు బీహారీవాసులు తెచ్చిన గంజాయిని పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కుక్కల వంశీ, ధైద జగదీష్, తాళ్లగడ్డకు చెందిన షేక్ హైమద్, వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన జంపాల నిఖిల్ అనే వ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తమ విచారణలో తేలిందని సీఐ తెలిపారు. జల్సాలకు అవసరమైన సొమ్మును సంపాదించుకునేందుకు గంజాయి విక్రయాలకు అలవాటుపడ్డారు. బీహార్ రాష్ట్రం నుంచి తెచ్చిన చెండుగంజాయిని 100 గ్రాముల ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.2500లకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో నిందితులు అంగీకరించారు. కేజీ గంజాయి విక్రయాలతో వచ్చే రూ.25వేలతో తమ జల్సాలు తీర్చుకోవడంతో పాటు మత్తు కోసం గంజాయి తాగుతున్నట్లు గుర్తించామని సీఐ తెలిపారు. తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు రాంనగర్ బందం వద్ద శుక్రవారం బీహార్ రాష్ట్రానికి చెందిని ఇద్దరు గంజాయి విక్రేతలతో పాటు గంజాయిని వాడుతున్న మరో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి ఒక కేజీ, 140 గ్రాముల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ నాగభూషణం తెలిపారు. గంజాయి విక్రేతలను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ సైదిరెడ్డి, పీసీలు శ్రీను, నర్సింహ, వీరబాబు, సంధ్య, ప్రసాద్‌లను సీఐ అభినందించారు.

సరిపడా యూరియా సరఫరా చేయాలి

చిట్యాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. చిట్యాలలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి జూన్ నాటికే 9లక్షల టన్నుల యూరియా అవసరం ఉండగా కేంద్రప్రభుత్వం 4 లక్షల టన్నులు మాత్రమే సరపరా చేసిందన్నారు. సమావేశంలో ఐతరాజు నర్సింహ, అవిశెట్టి శంకరయ్య, మాదరబోయిన వెంకన్న, గట్టయ్య, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

పట్టణంలో రేపటి నుంచి ఫుడ్ ఫెస్టివల్

రామగిరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వంద రోజుల కార్యాచరణలో భాగంగా పట్టణంలోని మైసయ్య విగ్రహం సమీపంలోని అన్నపూర్ణ క్యాంటీన్ వద్ద ఈ నెల 8 నుంచి ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో వివిధ రకాల వంటలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు, మహిళా సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కట్టంగూరులో కుక్కల బెడద



కట్టంగూరులో రాత్రి వేళలో గుంపులుగా వెళ్తున్న కుక్కలు

కట్టంగూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరు మండల కేంద్రంలో కొన్ని రోజులుగా కుక్కల బెడద తీవ్రమైంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుక్కలు గ్రామంలోని వీధుల గుండా రోడ్లపై గుంపులుగుంపులుగా తిరుగుతుండటంతో వాహనదారులు, కాలినడకతో వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళలో కుక్కల సంచారం వల్ల పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళలో ప్రజలు బయటకు వెళ్లాలంటే కట్టెలు పట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కట్టంగూరులోని కలిమెర రోడ్డు సర్వీస్ రోడ్డుపై రాత్రి వేళలో కుక్కలు తిరగడంతో వేరే గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు స్వంత గ్రామాలతో పాటు ఇళ్లలోకి వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. దీంతో పాటు మూడు రోజుల క్రితం మండలంలోని ఈదులూరు, మునకుంట్ల గ్రామాల్లో పిచ్చికుక్క స్వైర విహారం చేసి దాదాపు 8 మందిని గాయపరిచింది. సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకొని కుక్కల బెడద నుంచి కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆందోళన చెందుతున్న ప్రజలు

అధికారులు తగు చర్యలు చేపట్టాలి



కట్టంగూరులో రోజురోజుకు కుక్కల బెడద ఎక్కువైంది. రాత్రి వేళల్లో గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నాయి. కట్టంగూరులోని కలిమెర రోడ్డు, సర్వీస్ రోడ్డుపై కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రాత్రి వేళలో ఈ రోడ్ల గుండా నడవాలంటే ప్రజలు భయపడుతున్నారు. అధికారులు కుక్కల బెడద అరికట్టేందుకు తగు చర్యలు చేపట్టాలి.

- ఎరుకల మల్లేష్, కట్టంగూరు

ఎంపీడీవోకు వినతి

కట్టంగూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలో మొదటి విడత 20 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో 9 మంది లబ్ధిదారులు ఇళ్లను కట్టుకోవడం లేదని వారికి బదులుగా అర్హులైన మరో 9మంది లబ్ధిదారులకు అవకాశం ఇవ్వాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో జ్ఞానప్రకాశ్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దపాటి సుధాకర్, మల్లేష్, యాదగిరి పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించడం

అభినందనీయం

మర్రిగూడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలలో నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించి ఆపరేషన్లు కూడా ఇక్కడే చేయడం హర్షించదగ్గ విషయమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కుదాభక్షపల్లి గ్రామంలో ఆ గ్రామానికి చెందిన పాశం ధర్మారెడ్డి జ్ఞాపకార్థం అతని కుమారుడు పాశం కిరణ్ ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లోని శంకర్ నేత్రాలయం సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ గ్రామంలో ఆరు రోజుల వరకు ఉచితంగా కంటి పొరల పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికీ ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తారని, ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసువాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పాశం సురేందర్ రెడ్డి, పందుల పాండు గౌడు, రాందాస్ శ్రీనివాస్, అనిల్‌రెడ్డి, వెంకట బాలయ్య, అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గణేష్ శోభాయాత్ర



మూసీ రిజర్వాయర్‌లో
వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

● మూసీలో నిమజ్జనాలు

కేతేపల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం గణేష్ నిమజ్జన శోభాయాత్రలు వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో తొమ్మిది రోజులుగా ప్రత్యేక మండపాల్లో పూజలు చేసిన వినాయక విగ్రహాలను ఆనందోత్సాహాల మధ్య చెరువులు, కుంటలకు తరలించి నిమజ్జనం చేశారు. అందంగా అలంకరించిన ట్రాక్టర్లు, ఆటోలలో నిలిపి మేళతాళాలు, డప్పువాయిద్యాలు, మహిళలు, యువతీ యువకుల ఆట, పాటలతో గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొర్లపహాడ్ గ్రామంలో గణేష్ మండపం వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శోభాయాత్రను నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుత్తా మంజుల ప్రారంభించారు. విగ్రహాలను నిమజ్జనం కోసం మూసీ ప్రాజెక్టుకు, శ్రీశైలం, భద్రాచలం తదితర ప్రాంతాలకు తరలించగా మరికొందరు స్థానికంగా ఉన్న చెరువులు, కుంటల్లోనే నిమజ్జనం చేశారు. శోభాయాత్ర సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

మూసీలో కొనసాగిన నిమజ్జన కోలాహలం

జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత భారీ నీటి పారుదల ప్రాజెక్టుగా ఉన్న మూసీ రిజర్వాయర్ వద్ద శనివారం సాయంత్రం వినాయక నిమజ్జన కోలాహలం కొనసాగింది. నకిరేకల్, సూర్యాపేట, అర్వపల్లి, కేతేపల్లి మండలాలకు చెందిన అనేక గ్రామాల నుంచి తరలివచ్చిన విగ్రహాలను శనివారం రాత్రి వరకు మూసీ రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు. శనివారం రాత్రి పొద్దుపోయే వరకూ కొనసాగిన నిమజ్జనంలో అధిక సంఖ్యలో విగ్రహాలను మూసీ నిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు. నకిరేకల్, కేతేపల్లి, శాలిగౌరారం మండలాల నుంచి వచ్చే విగ్రహాలను మూసీ గెస్ట్‌హౌజ్ పరిసరాల్లో, సూర్యాపేట, అర్వపల్లి మండలాల నుంచి వచ్చే విగ్రహాలను ప్రాజెక్టు ఎడమకాల్వ వైపున గల సూర్యాపేట మండలంలోని రత్నపురం పరిసరాల్లో మూసీ రిజర్వాయర్‌లో నిమజ్జనానికి పోలీసులు అనుమతించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సూర్యాపేట రూరల్ నకిరేకల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముగిసిన గణేష్ శోభాయాత్ర

కనగల్: మండలంలోని వివిధ గ్రామాల్లో మూడు రోజులుగా కొనసాగిన గణేషుడి శోభాయాత్రలు శనివారం ముగిశాయి. ఎస్‌లింగోటం గ్రామంలో మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నేత పోచమళ్ల లింగయ్యగౌడ్ ఆధ్వర్యంలో మహిళల కోలాట ప్రదర్శనతో ఊరేగింపుగా తరలించి గంగమ్మ ఒడికి చేర్చారు. కనగల్ ఎక్స్‌రోడ్డులోని విగ్రహాన్ని ఉత్సవకమిటీ సభ్యులు సమీప చెరువుకు తరలించి సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మండల కోఆప్షన్ అజీజ్, పోచమల్ల సురేష్ తదితరులున్నారు.

నార్కట్‌పల్లి: తొమ్మిది రోజుల పాటు భక్తులతో పూజలందుకున్న గణనాథులను గంగమ్మ చెంతకు చేర్చే నిమజ్జన శోభాయాత్ర నార్కట్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీభవన్‌లో పది రోజుల పాటు భక్తులతో పూజలందుకున్న గణనాథునికి ఆర్యవైశ్యులు నిర్వహించిన శోభాయాత్ర ఆద్యంతం ఆకట్టుకుంది. మహిళల కోలాటం, యువకులు, చిన్నారుల నృత్యాల మధ్య శోభాయాత్ర నిర్వహించారు.

● నకిరేకల్: నకిరేకల్ మండలంలోని చందుపట్ల, మర్రూరు గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్నంతరెడ్డి శ్రీదేవిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బుడిగే సైదులు, యానాల శంకర్‌రెడ్డి, యానాల శ్రీనివాస్‌రెడ్డి, సాయన్న, డాకయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.



కనగల్: ఎస్‌లింగోటం గ్రామ గణేష్ శోభయాత్రలో పాల్గొన్న మహిళలు



కేతేపల్లిలో గణేష్ శోభాయాత్రలో పాల్గొన్న యువకులు

గణపతి లడ్డూ @ రూ.1,10,116

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వారిజాల వేణుగోపాలస్వామి భక్త మండలి నవశక్తి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద నవరాత్రి పూజలందుకున్న లడ్డూను ఇదే మండలం శాపల్లి గ్రామానికి చెందిన బీజేవైఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పజ్జూరి వెంకట్‌రెడ్డి రూ.1,10,116ల అత్యధిక పాట పాడి లడ్డూను కైవసం చేసుకున్నారు. లడ్డూను కైవసం చేసుకున్న వెంకట్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అభినందించారు. అనంతరం యాద వెంకన్న కుటుంబసభ్యులు దాతలుగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా వాసవీభవన్‌లో నవరాత్రి పూజలందుకున్న లడ్డూను ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు బిల్లకంటి శ్రీకాంత్ రూ.51,116లకు సొంతం చేసుకున్నాడు. ఈ కార్యక్రమంలో బత్తుల ఊశయ్య, దూదిమెట్ల సత్తయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, జెరిపోతుల భరత్, పుల్లెంల అచ్చాలు, మేడబోయిన శ్రీనివాస్, వడ్డేగోని రామలింగం, శంకర్, విష్ణుమూర్తి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడలో రూ.1,45,500

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో యువ చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని వద్ద శనివారం లడ్డూ వేలంపాట నిర్వహించారు. బీఆర్ఎస్ యువజన నాయకుడు సామాజిక కార్యకర్త వల్లంల సంతోషయాదవ్ వేలంలో రూ.1,45,500లకు లడ్డూను కైవసం చేసుకున్నాడు. అదేవిధంగా స్వామివారి కలశాన్ని కూడా దక్కించుకున్నారు. గణనాథుడి శోభాయాత్రను కూడా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. ప్రజలకు మంచి చేసే కార్యక్రమాలకు తన సహకారం ఎప్పటికీ ఉంటుందని వెల్లడించారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌గా ఉదయ్



ఉదయ్

శాలిగౌరారం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌గా గంజి ఉదయ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చౌటుప్పల్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేసిన మూడావత్ జామ్లా హైదరాబాద్‌లోని సూరారం బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లారు. నూతన మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన మేనేజర్ ఉదయ్ మాట్లాడుతూ తమ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శాలిగౌరారం మండలం పెర్కకొండారంలోని టీజీ బ్యాంకు మేనేజర్ విఘ్నేశ్వర్‌రెడ్డి, వరంగల్ జిల్లా మండలపల్లి బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కె.నరేష్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు



చిట్యాల: మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

చిట్యాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గించడం వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్ అన్నారు. శనివారం చిట్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాస శ్రీనివాస్, రుద్రవరం లింగస్వామి, చికిలంమెట్ల అశోక్, కన్నెబోయిన మహలింగం, పల్లె వెంకన్న, రామకృష్ణ, గోవర్ధన్ పాల్గొన్నారు.

బైరు మల్లయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి బైరు మల్లయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరామోజు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని అవురవాణిలో బైరు మల్లయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం సీపీఎం బలోపేతం కోసం మల్లయ్య చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, యాదగిరిరెడ్డి, బైరు భాస్కర్, కల్లూరి కంఠమహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ ఓటర్ల సవరణ షురూ

(5వ పేజీ తరువాయి)

ఖరారు చేసేందుకు పంచాయతీరాజ్‌శాఖ సిద్ధమైంది. జిల్లా పరిషత్ అధ్యక్ష పదవికి రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్లు ఖరారు చేయనుండగా, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు జిల్లా యూనిట్‌గా రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. అదేవిధంగా మండలం యూనిట్‌గా ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు కేటాయిస్తారు. జడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు రిజర్వేషన్ల కోటాను రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ నిర్ణయిస్తే, స్థానాల కేటాయింపును కలెక్టర్ నేతృత్వంలో ఖరారు చేస్తారు. ఎంపీటీసీ స్థానాలకు కోటాను కలెక్టర్ల నేతృత్వంలో ఖరారు చేస్తే, స్థానాల కేటాయింపును ఆర్డీవోల నేతృత్వంలో చేస్తారు. 2011 ఆధారంగా జిల్లాలో ఆయా మండలాల్లో ఏ రిజర్వేషన్ వస్తుందనే అంశంపై ఇప్పటికే రాజకీయ నాయకులు అంచనాలతో లెక్కలు వేసుకుంటున్నారు. జడ్పీ చైర్మన్ పదవి ఏ వర్గానికి రిజర్వ్ అవుతుందనే అంశంపైనా, ఆ పదవిని ఆశించే వివిధ సామాజికవర్గాలకు చెందిన కీలక నాయకులు చర్చలు జరుపుతున్నారు. రిజర్వేషన్లు తేలితే బరిలో దిగేందుకు నాయకులు రంగం సిద్ధం చేసుకొని ఉండడంతో అన్ని మండలాల్లో, గ్రామాల్లో ఎక్కడ చూసినా దీనిపైనే చర్చ సాగుతోంది.

జడ్పీటీసీ స్థానం	ఎంపీటీసీ స్థానాలు	పోలింగ్ స్టేషన్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం
అడవిదేవులపల్లి	5	26	7340	7334	0	14,674
అనుముల	8	45	11588	12207	1	23796
చందంపేట	9	64	15768	14910	1	30679
చండూరు	8	43	12137	12186	0	24323
చింతపల్లి	14	85	22418	22633	3	45054
చిట్యాల	12	60	17760	17975	0	35716
దామరచర్ల	14	78	20179	20732	3	40914
దేవరకొండ	11	65	17909	17806	1	35716
గట్టుప్పల్	5	27	7832	7785	0	15617
గుడిపల్లి	5	24	6066	6205	0	12271
గుండ్లపల్లి	13	78	20660	20863	2	41525
గుర్రంపోడు	12	74	18947	19623	1	38571
కనగల్	12	67	18313	18579	0	36892
కట్టంగూరు	13	63	18565	18797	0	37362
కేతేపల్లి	11	55	15136	15947	1	31084
కొండమల్లేపల్లి	9	53	14992	14604	3	29599
మాడుగులపల్లి	10	56	14837	15686	0	30523
మర్రిగూడ	10	51	15146	15639	0	30785
మిర్యాలగూడ	19	99	27130	28042	8	55180
మునుగోడు	13	69	18990	19048	0	38038
నకిరేకల్	9	47	13283	13558	2	26843
నల్లగొండ	13	67	19166	20063	0	39229
నాంపల్లి	11	68	17886	18524	1	36411
నార్కట్‌పల్లి	15	83	21508	22263	1	43772
నేరేడుగొమ్ము	6	45	10304	9955	3	20262
నిడమనూరు	13	65	17516	18577	1	36094
పీఏపల్లి	10	51	13848	13790	6	27644
పెద్దవూర	11	62	16921	17564	9	34494
శాలిగౌరారం	13	70	19937	20448	3	40388
తిప్పర్తి	9	48	13468	14222	0	27690
తిరుమలగిరిసాగర్	11	64	17381	17690	4	35075
త్రిపురారం	12	66	17963	18732	3	36698
వేములపల్లి	7	38	9966	10602	0	20568
మొత్తం	353	1956	530860	542589	57	1073506

నష్టపరిహారం ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభించాలి



బైపాస్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణ పనులు పూర్తి నష్టపరిహారం చెల్లించిన తర్వాతే ప్రారంభించాలని 565 జాతీయ రహదారి బైపాస్ నిర్వాసితుల పోరాట కమిటీ గౌరవ అధ్యక్షుడు సయ్యద్ హాశం, మాజీ కౌన్సిలర్ ఎండి సలీం, ఉట్కూరు వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్వాసితుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం గిరికబాయిగూడెం బైపాస్‌లో ధ్వంసం చేసిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పానగల్ నుంచి సాగర్ రోడ్డు వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం 14 కిలోమీటర్లు నిర్ణయించి సుమారు 1170 మంది బాధితులను గుర్తించినట్లు తెలిపారు. 35శాతం బాధితులకు నోటీసులు కానీ నష్టపరిహారం కానీ అందలేదని అన్నారు. నోటీసు నష్టపరిహారం ఇవ్వకుండా శుక్రవారం కాంట్రాక్టర్లు ఊట్కూరు వెంకట్‌రెడ్డి సర్వే నెంబరులో వరి కోతకు ఎదిగిన వరి పొలాన్ని ధ్వంసం చేశారని ఆరోపించారు. ఎక్కడ పనులు పూర్తికాక ముందే పంట పొలాలు ధ్వంసం చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. పూర్తి నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభించాలని, పంట మీద ఉన్న పొలాలకు కొంత సమయం ఇచ్చి పనులు చేయాలని కోరారు. అనంతరం ఆర్డీవో అశోక్‌రెడ్డికి భూ నిర్వాసితుల పోరాట కమిటీ తరఫున వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితులు ఉట్కూరు వెంకట్‌రెడ్డి, మహేష్, రఘురామరాజు, మల్లారెడ్డి, దుబ్బాక నాగేష్, దుబ్బాక మల్లేష్, దొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి మృతి జనశక్తి పార్టీకి తీరని లోటు : విమలక్క

కట్టంగూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీపీఐఎంఎల్ జనశక్తి సీనియర్ నాయకుడు పెద్దబోయిన అర్వపల్లి మృతి జనశక్తి పార్టీకి తీరని లోటని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి రాష్ట్రాల గౌరవాధ్యక్షురాలు విమలక్క అన్నారు. మండలంలోని మునుకుంట్ల గ్రామంలో నిర్వహించిన అర్వపల్లి సంతాప సభకు ఆమె హాజరై మాట్లాడారు. నిరంతరం ప్రజల కోసం, ప్రజా ఉద్యమాల కోసం అర్వపల్లి పరితపించేవారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ కట్ట భగవత్‌రెడ్డి, బొమ్మకంటి కొమరయ్య, పర్వతాలు, రవి, జానకిరాంరెడ్డి, సైదులు, పల్స యాదగిరి, రవి, గద్దపాటి దానయ్య, ఉట్కూరి ఏడుకొండలు, పల్లెబోయిన రవి, నాగరాజు, రమేష్, అనిత, సుధాకర్ తదితరులు ఉన్నారు.

'బీజేపీ నాయకుల అరెస్టు పిరికిపంద చర్య'

రామగిరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గణేష్ శోభాయాత్ర సందర్భంగా హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మంత్రి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రశ్నించడానికి ప్రయత్నించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డిని అరెస్టు చేయడం పిరికిపంద చర్య అని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర నాయకుడు చింత ముత్యాల్‌రావు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు, సూచనతోనే బీజేపీ నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేశారని ఆరోపించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మిర్యాల వెంకటేశం, నాయకులు సతీష్, పిట్టల శ్రీనివాస్, శివరామకృష్ణ, దాసరి వెంకన్న, అనిల్, శాంతిస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

● మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. చిట్యాల పట్టణానికి చెందిన బూరుగు కృష్ణయ్య కుమార్తె గాయత్రి ఫామ్ డి పూర్తి చేసి డాక్టర్ పట్టా పొందగా శనివారం చైర్మన్‌ను మండలంలోని ఉరుమడ్లలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. విషయం తెలుసుకున్న గాయత్రిని చైర్మన్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యకు పేద సామాన్య ఉన్నతమైనవారంటూ తారతమ్య బేధాల్లేవని కష్టపడి చదువుకుంటే ఎవరైనా ఎదగవచ్చని అన్నారు. ఉద్యోగ, ఉపాధి, వ్యాపారరంగాల్లో స్థిరపడి ఎందరికో అవకాశాలు కల్పించేందుకు వీలుంటుందన్నారు. వైద్యరంగంలో రాణించిన వారు పేద, సామాన్య ప్రజలకు సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బూరుగు కృష్ణయ్య, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు తేరటుపల్లి హనుమంతు, మండల ప్రధాన కార్యదర్శి పోలా పెద్దయ్య, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, వేలుపల్లి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీదేవి

చండూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వీధికుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో శ్రీదేవి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వీధి కుక్కల నియంత్రణపై శనివారం చండూరు పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వీధి కుక్కల సంచారం ఉన్న ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలని, వాటి కళ్లల్లోకి నేరుగా చూడవద్దని, వెంటపడితే ఆగిపోవాలన్నారు. కుక్కలను రెచ్చగొట్టవద్దని, వాటి జోలికి వెళ్ల వద్దని సూచించారు. కుక్క కరిచిన వెంటనే గాయాన్ని సబ్బుతో కడిగి వైద్యులను సంప్రదించాలన్నారు. కుక్కలు దాడులకు పాల్పడకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మల్లేశం, ఎంపీడీవో యాదగిరి, ఎన్విరాన్‌మెంట్ అధికారి అరవింద్‌రెడ్డి, వార్డు ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురువులు విద్యార్థులను సద్గురులుగా తీర్చిదిద్దాలి


● మార్కెట్ చైర్‌పర్సన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి



ఉత్తమ ఉపాధ్యాయులతో మార్కెట్ చైర్‌పర్సన్ వినోద, ఎంపీడీవో, ఎంఈవో

చిట్యాలరూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోని తరగతి గదుల్లో విద్యార్థులకు విద్య నేర్పే గురువులు వారిని సద్గురులుగా తీర్చిదిద్దాలని చిట్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం విద్యాబోధనలు చేసే ఉపాధ్యాయులందరూ ఉత్తమ ఉపాధ్యాయులేనని, విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. అనంతరం మండల ఉత్తమ ఉపాధ్యాయులు 10 మంది, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా 8 మంది ఎంపికైనందున మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ప్రశంసాపత్రాన్ని అందజేసి జ్ఞాపికలను అందించి ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్‌పి. జయలక్ష్మి, ఎంఈవో పానుగోతు సైదానాయక్, హెచ్‌ఎం సుశీల, లుకేందర్‌రెడ్డి, శ్రీధర్, యాదయ్య, సత్తయ్య, నాగరాజు, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, నాగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్, సీఆర్‌పీలు రంగరాజు జయకాంత్, జాన్, ఎమ్మార్సీ సిబ్బంది సరిత పాల్గొన్నారు.



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.60 (310.8498)	54,656	54,656
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.60 (4.09)	1,968.62	2,866.18
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.292 (43.1584)	35,800	17,000

చికెన్ ధరలు	లైవ్ : రూ.120	డ్రెస్ : రూ.200	స్కిన్‌లెస్ : రూ.220

దసరాకైనా జీతాలు వచ్చేనా?

- ఆరు నెలలుగా రాని మోడల్ స్కూల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు
- ఉమ్మడి జిల్లాలో రూ.కోటి 24 లక్షలకు పైగా బకాయిలు



ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలలుగా జీతాలు నిలిచిపోయాయి. నెల నెలా వేతనం వస్తుంటేనే పెరిగిన నిత్యావసరాల ధరలతో కుటుంబాలను వెళ్లదీయడం కష్టమవుతోంది. ఈ తరుణంలో ఆరు నెలలుగా వేతనాలు అందక కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని 33 స్కూళ్లకు సంబంధించి సుమారు రూ.కోటి 24 లక్షలకు పైగా వేతనాలు బకాయి ఉన్నాయి.

మొత్తం 132 మంది అవుట్‌సోర్సింగ్ కింద పనిచేస్తుండగా అందులో ఫిజికల్ డైరెక్టర్‌తో పాటు ఆపరేటర్, అటెండర్, నైట్‌వాచ్‌మన్‌లు ఉన్నారు. ఈ నెలలోనే ప్రధాన పండుగైన దసరా ఉండగా ఆనాటికైనా వేతనాలు అందకపోతాయా అని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఒకవేళ వేతనాలు ఆలస్యం చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

- వివరాలు 6వ పేజీలో

పరిషత్ ఓటర్ల సవరణ షురూ

పరిషత్ ఎన్నికల ఓటర్ల జాబితా సవరణకు జిల్లా ఎన్నికల అధికారులు ముసాయిదా జాబితా విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించిన షెడ్యూల్ మేరకు శనివారం ఎంపీటీసీ స్థానాలకు జిల్లాలోని గుర్తించిన 1,956 పోలింగ్ కేంద్రాల వద్ద, జడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాలను 33 మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



- ముసాయిదా విడుదలచేసిన అధికారులు
- 1,956 పోలింగ్ కేంద్రాలు, 10.73లక్షల మంది ఓటర్లు
- 10న తుదిజాబితా ప్రచురణ

తాజాగా, విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 33 జడ్పీటీసీ స్థానాలు, 33 ఎంపీపీ స్థానాలతో పాటు, 353 ఎంపీటీసీ స్థానాలను ప్రకటించారు. అదేవిధంగా మొత్తం 1,956 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించగా, 10,73,506 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లా ఎన్నికల అధికారి నేతృత్వంలో సోమవారం జిల్లా స్థాయిలో, అన్ని మండలాల్లో మండల పరిషత్ అధికారుల నేతృత్వంలో మండల స్థాయిల్లో రాజకీయ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం వరకు ముసాయిదా జాబితాలపై సూచనలు, అభ్యంతరాలు తీసుకుంటారు. ఈనెల 9న వాటిని పరిశీలించి పరిష్కరిస్తారు. 10వ తేదీన పోలింగ్ కేంద్రాల వారీగా తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి వెల్లడిస్తారు.

33 జడ్పీటీసీ, ఎంపీపీ, 353 ఎంపీటీసీ స్థానాలు

రాష్ట్రంలోనే పెద్ద జిల్లా అయిన నల్లగొండలో 33 మండల పరిషత్‌లతో పాటు, 33 జడ్పీటీసీ స్థానాలు, 353ఎంపీటీసీ స్థానాలను అధికారులు ఖరారు చేశారు. మొత్తం 1,956 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించారు. కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా 2016లో నూతనంగా అడవిదేవులపల్లి, కొండమల్లేపల్లి, మాడుగులపల్లి, నేరేడుగొమ్ము, తిరుమలగిరి(సాగర్) మండల పరిషత్‌లు ఏర్పాటవగా, 2019 పరిషత్ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా వీటిని కలుపుకొని 31 జడ్పీటీసీ స్థానాలు, 31మండల పరిషత్‌లతో పాటు, 352 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. తాజాగా,గట్టుప్పల్, గుడిపల్లి మండలాలు నూతనంగా ఏర్పాటవగా, అక్కడ కూడా మండల పరిషత్‌లను ఏర్పాటు చేశారు. వాటితో కలిపి 33జడ్పీటీసీ స్థానాలు, 33 మండల పరిషత్‌లలో 353 ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేశారు. అత్యధికంగా మిర్యాలగూడ మండల పరిషత్‌లో 19 ఎంపీటీసీ స్థానాలు ఉండగా,అత్యల్పంగా అడవిదేవులపల్లి, గట్టుప్పల్, గుడిపల్లి మండలాల్లో ఐదేసి చొప్పున ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.

ప్రాథమిక కసరత్తు పూర్తి...

జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ప్రాథమిక కసరత్తు పూర్తయింది. పోలింగ్ కేంద్రాలను గుర్తించడంతో పాటు, పోలింగ్ స్టేషన్ల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితాలు ఖరారు చేశారు. పోలింగ్ సిబ్బందిని సైతం గుర్తించి శిక్షణ ఇచ్చారు. పార్టీల పరంగానే ఈ స్థానాలకు ఎన్నికలు జరగనుండడంతో అందుకు అవసరమైన పోలింగ్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలను సైతం అందుబాటులో ఉంచారు. ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించిన మరుక్షణం నిర్వహణలోకి దిగేందుకు వీలుగా పంచాయతీరాజ్‌శాఖ సన్నద్ధమైంది. మరోవైపు అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీల ద్వితీయ, క్షేత్రస్థాయి నాయకులు సైతం రిజర్వేషన్లపై ఆసక్తిగా ఉన్నారు.

రిజర్వేషన్ల కోసం ఎదురుచూపు...

పరిషత్ ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుండగా, రాజకీయ నాయకులు రిజర్వేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఈ ఎన్నికల్లో బీసీ వర్గాలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు జీవో విడుదల చేసిన తక్షణమే రిజర్వేషన్ల కోటా, స్థానాలు...

- మిగతా 8వ పేజీలో...

కొనసాగిన గణేష్ నిమజ్జనాలు

- రెండోరోజూ కోలాహలం నడుమ శోభాయాత్రలు
- జిల్లా వ్యాప్తంగా పూర్తయిన నిమజ్జనాలు



జిల్లాలో గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా వినాయక ప్రతిమలకు నిమజ్జన కార్యక్రమాలు శనివారం కూడా కొనసాగాయి. ఆదివారం చంద్రగ్రహణం ఉండటంతో ప్రతిష్ఠించిన ప్రతీ విగ్రహాన్ని నిర్వాహకులు తప్పనిపరిస్థితుల్లో నిమజ్జనం చేశారు. అంతకుముందు అందంగా అలంకరించిన వాహనాల్లో స్వామి వారి ప్రతిమలను అధిష్ఠింపజేసి శోభాయాత్రను ప్రారంభించారు. నృత్యాలు, మేళతాళాలు, బ్యాండ్ వాయిద్యాల సందడి మధ్య శోభాయాత్ర సాగింది. స్థానిక చెరువులతో పాటు జిల్లా కేంద్రంలో వల్లభరావు చెరువు, 14వ మైలు వద్ద కృష్ణానదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

- వివరాలు 8వ పేజీలో

అవే బారులు .. అవే బాధలు

- యూరియా కోసం పాట్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బారులు తీరిన రైతులు



యూరియా వచ్చిందని తెలియడంతో శాలిగౌరారం మండలంలో పీఏసీఎస్ వద్ద గుమికూడిన రైతులు

యూరియా కోసం రైతుల కష్టాలు తీరేట్లు లేవు. శనివారం కూడా సహకార సంఘాల వద్ద రైతులు బారులు తీరారు. తెల్లవారుజాము నుంచే పీఏసీఎస్‌ల వద్దకు చేరుకుంటున్నారు. సాగుకు తగ్గట్టుగా యూరియా అందించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు పీఏసీఎస్‌ల వద్ద చెప్పులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు క్యూలైన్లలో ఉంచి యూరియా కోసం పడిగాపులు పడ్డారు. నిడమనూరులో రైతుల గంటలకొద్దీ క్యూలైన్లలో నిల్చోగా రెండు బస్తాల చొప్పున యూరియా ఇచ్చేందుకు టోకెన్లు ఇచ్చారు. పోలీసుల పహారా నడుమ 200 మంది రైతులకు మాత్రమే యూరియా అందజేశారు. శాలిగౌరారం, కట్టంగూరు, వేములపల్లి, చండూరు, మునుగోడు మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మహిళలు చంటిపిల్లలతో వచ్చి పీఏసీఎస్‌ల వద్ద తెల్లవారుజాము నుంచే పడిగాపులు కాశారు.

- వివరాలు 7వ పేజీలో

గ్రామ పాలనాధికారులు పనిపై శ్రద్ధ చూపాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలనాధికారులు పనిపై శ్రద్ధ వహించి విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన గ్రామ పాలనాధికారుల కౌన్సిలింగ్‌లో ఆమె మాట్లాడారు. ఉత్తర్వులు అందుకున్న వారు సోమవారం నాటికి విధుల్లో చేరాలన్నారు. అభ్యర్థులందరి సమక్షంలోనే ఖాళీల జాబితా ప్రదర్శిస్తూ వారి ఐచ్ఛికాల మేరకు పోస్టింగులు కేటాయించామన్నారు.



కనగల్ మండలం తేలకంటిగూడెంలో ఇందిరమ్మ ఇళ్లను వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చండూరు కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి నేలపై కూర్చొని భోజనం చేస్తున్న కలెక్టర్

అధిక సంఖ్యలో దరఖాస్తులు తీసుకోవాలి

జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఎక్కువ దరఖాస్తులు స్వీకరించేందుకు దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఇప్పటి వరకు 6,000 దరఖాస్తులను ప్రభుత్వానికి పంపామని, మరో నాలుగు వేల దరఖాస్తులను పంపించాలన్నారు. గడిచిన ఏడెనిమిది ఏళ్లలో జిల్లాలో 42,000 మందికి పైగా మృతిచెందారన్నారు. వారి కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సహాయం అందేలా అధికారులు దృష్టిసారించాలన్నారు. జాతీయ కుటుంబం ప్రయోజన పథకం కింద లబ్ధి చేకూర్చేందుకు బాగా కృషి చేసిన ఆర్డీవోలు, నలుగురు తహసీల్దార్లు, నలుగురు ఎంపీడీవోలు, నలుగురు పంచాయతీ కార్యదర్శులను 13న సన్మానించనున్నట్లు చెప్పారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితాలపై ఈ నెల 8వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి, 9న పరిష్కారం, 10న తుది జాబితా ప్రచురించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను సిద్ధం చేయాలి

(ఆంధ్రజ్యోతి, కనగల్): ఇందిరమ్మ ఇళ్ల పనులను త్వరగా పూర్తిచేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం మండలంలోని తేలకంటిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పనులను ఆమె పరిశీలించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి 83 ఇళ్లు మంజూరు చేయగా ఐదిళ్ల పనులు దాదాపు పూర్తయ్యాయని, మరో 18 ఇళ్లు స్లాబ్ దశలో ఉన్నాయని అధికారులు వివరించారు. అనంతరం కనగల్ పీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆమె వెంట ఆర్డీవో అశోక్‌రెడ్డి, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో సుమలత, వైద్యాధికారి గాదరి రామకృష్ణ, ఎంపీవో వీరబాబు, హౌసింగ్ ఏఈవో వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ప్రయోజనం కలగాలి

(ఆంధ్రజ్యోతి, చండూరు): అర్హత కలిగిన కుటుంబాలకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ప్రయోజనం కలగాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం చండూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీచేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఆమె వెంట ఆర్డీవో శ్రీదేవి, ఎంపీడీవో యాదగిరి, మునిసిపల్ కమిషనర్ మల్లేశం, తదితరులు ఉన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని విమర్శిస్తే సహించేది లేదు

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండరూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని, మంత్రిని విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి విమర్శించారు. నల్లగొండ పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ నిమజ్జనం రోజు 1వ నెంబర్ వినాయక విగ్రహం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడితో పాటు మాజీ ఎమ్మెల్యే వ్యవహరించిన తీరు సరిగా లేదన్నారు. వారిద్దరి దిగజారుడు రాజకీయాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉత్సవ కమిటీ ఆహ్వానంతో నిమజ్జనం రోజు 1వ నెంబర్ విగ్రహం వద్దకు వచ్చి మాట్లాడుతుండగా, వేదికపై పిలవలేదనే అక్కసుతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి ఘర్షణ వాతావరణం సృష్టించాడని ఆరోపించారు. ఆయనకు కనీస రాజకీయ అవగాహన లేదని, ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు జరుగుతుంటే జీర్ణించుకోలేక ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నారని అన్నారు. ఆయన్ను పోలీసులు అక్కడి నుంచి తరలించారే తప్ప అరెస్టు చేయలేదన్నారు. అనంతరం అక్కడికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కావాలని రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నించారని విమర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్‌మెన్ల కోసం ఇలా ఘర్షణ పడి కాంగ్రెస్ నాయకులతో దాడులు చేయించుకోవాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే నోటి దురుసు వల్లే గత ఎన్నికల్లో ప్రజలు ఓడించారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. రెండు మూడు పార్టీలు మారిన వ్యక్తి కూడా యూరియాపై చిల్లర రాజకీయాలు చేస్తున్నాడని, స్థాయిని మించి విమర్శలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ఎక్కడా లేని విధంగా నల్లగొండలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పొత్తు ఉందని ధ్వజమెత్తారు. గణేష్ నిమజ్జనం రోజు నల్లగొండలో జరిగిన సంఘటనే నిదర్శనమన్నారు. రాజకీయ లబ్ధికోసం బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత కత్తుల కోటి, రోడ్డు రవాణా సంస్థ కమిటీ సభ్యుడు కుసుకుంట్ల రాజిరెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప, నాయకులు బొజ్జ శంకర్, సురిగి వెంకన్నగౌడ్, మామిడి కార్తీక్, గాలి నాగరాజు, కంచర్ల ఆనంద్‌రెడ్డి, ఇటికాల శ్రీనివాస్, పిల్లి యాదగిరి, పాండు, సుజాత, స్వరూపరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మల మోహన్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ షమీం అక్తర్

చిన్నారులు కష్టపడి చదివాలి

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీం అక్తర్

నల్లగొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు కష్టపడి చదివి జీవితంలో మంచి స్థానంలోకి రావాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీం అక్తర్ అన్నారు. శనివారం పానగల్‌లో ఉన్న చారుమతి చైల్డ్‌కేర్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. అక్కడి చిన్నారులను ఉద్దేశించి మాట్లాడుతూ జీవితం సంఘర్షణలతో కూడుకున్నదని, ప్రతీ ఒక్కరు కష్టపడి చదివితేనే ముందుకు వెళ్తారన్నారు. పిల్లలు చదువుకునేందుకు ప్రభుత్వం పలు అవకాశాలు, సౌకర్యాలను కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గొప్పవారు కావాలనే పట్టుదల, సంకల్పంతో చదువుకోవాలని, వారి భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో గజాల అజూం అక్తర్, సీడబ్ల్యూసీ చైర్మన్ కృష్ణ, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, చారుమతి చైల్డ్‌కేర్ సెంటర్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగసేనారెడ్డి, అనంతరెడ్డి, కట్ట వెంకట్‌రెడ్డి, వెంకన్న, డీసీపీవో గణేష్, సీడీపీవో నిర్మల, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

నేడు చెర్వుగట్టు ఆలయం మూసివేత

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7న రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని మూసివేస్తున్నట్లు ఈవో సిరికొండ నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం స్వామివారికి నివేదన అనంతరం ద్వారబంధం చేస్తామని తిరిగి సోమవారం సంప్రోక్షణ అనంతరం ఆలయాన్ని తెరిచి భక్తులకు దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు.

పన్నుల భారం తగ్గించిన మోదీ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాగం, తదితరులు

నల్లగొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల ప్రయోజనం కోసం నిత్యావసర సరుకులపై ప్రధానమంత్రి మోదీ పన్నుల భారం తగ్గించడం హర్షణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిత్యావసర సరుకులు, ఆహార పదార్థాలపై భారీగా పన్నులను తగ్గించారన్నారు. అంత్యోదయ యోజన సిద్ధాంతానికి అనుగుణంగా పనిచేస్తున్నారన్నారు. మోదీ పన్నుల భారం తగ్గించి ప్రజలకు పండుగ కానుక ఇస్తే కాంగ్రెస్ పార్టీ మాత్రం దీంతో దేశం నష్టపోతుదనడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్రశేఖర్, నల్లగొండ పార్లమెంటు కన్వీనర్ బండారు ప్రసాద్, నాయకులు లింగస్వామి, విద్యాసాగర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేశం, మహేష్, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, కిషన్, జగ్జీవన్, శివరామకృష్ణ, బలరాం, మధు, శాంతి స్వరూప్, నీరజ, తారా, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం

పల్లా దేవేందర్‌రెడ్డి

దేవరకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు చేస్తోందని సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం దేవరకొండ మార్కెట్ యార్డులో ఎరువుల దుకాణాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ కార్మికులకు 15శాతం రేట్లు పెంచేందుకు ఫర్టిలైజర్స్ యజమానులు అంగీకరించినట్లు తెలిపారు. రెండేళ్లకోసారి హమాలీ రేట్లు పెంచాలన్నారు. ఎగుమతి, దిగుమతి హమాలీ రేట్లతోపాటు గ్రూపు ఇన్స్‌రెన్స్ సౌకర్యం, సంవత్సరానికి రెండు జతల దుస్తులు ఇవ్వాలని కోరగా, అందుకు యజమానులు అంగీకరించినట్టు తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణరెడ్డి, దాచేపల్లి రమేష్, నీల రవి, హమాలీ యూనియన్ నాయకులు నీల వెంకటయ్య, కృష్ణయ్య, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ***
మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ
8 www.andhrajyothy.com ● ఆదివారం 7 సెప్టెంబరు 2025

దాతల సహకారం అభినందనీయం

దేవరకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేవరకొండ విశ్రాంత ఉద్యోగ సంఘ భవన నిర్మాణానికి దాతలు నిధులు అందజేయడం అభినందనీయమని విశ్రాంత ఉద్యోగ సంఘం నియోజకవర్గ కార్యదర్శి అంకం చంద్రమౌళి అన్నారు. సంఘ భవన నిర్మాణానికి రిటైర్డ్ అధికారి శనివారం మణెమ్మ రూ.10వేలు విరాళం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. దాతలు భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు.

కలెక్టరేట్ ముట్టడి జయప్రదం చేయాలి

దేవరకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పింఛనర్ల, దివ్యాంగుల పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం (నేడు) నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకుడు శ్రీరామదాసు వెంకటచారి శనివారం ఒక ప్రకటనలో కోరారు. కలెక్టరేట్ ముట్టడిని పింఛన్‌దారులు,దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఓటర్ల, పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం ఎంపీటీసీ, జడ్పీటీసీ-2025 ఎన్నికలు నిర్వహించేందుకు డ్రాఫ్ట్ ఫొటో ఓటర్ల జాబితాను, డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితాను శనివారం ఎంపీడీవో శేషగిరిశర్మ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ మండలంలో మొత్తం 19 ఎంపీటీసీలు, జడ్పీటీసీ స్థానం ఉండగా మండలంలో 55,180 మంది ఓటర్లు, 99 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. డ్రాఫ్ట్ ఫొటోఓటర్ల, పోలింగ్ కేంద్రాల జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు దరఖాస్తులు అందించాలని అన్నారు. అలాగే ఈనెల 8న స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నందున సకాలంలో హాజరై అభ్యంతరాలు, సూచనలు అందించాలన్నారు. తుది జాబితాను ఈనెల 10న ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.



వేములపల్లిలో ఓటరు జాబితాను విడుదల చేస్తున్న ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, సిబ్బంది

ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

వేములపల్లి : మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్ కేంద్రాలు, డ్రాఫ్ట్ ఫొటో ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 8వరకు దరఖాస్తులు సమర్పించాలని ఎంపీడీవో జితేందర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితాను విడుదల చేసి ఎంపీడీవో కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు చెప్పా రు. మండలంలో 38 పోలింగ్ స్టేషన్లు, ఓటర్లు 20,568 మంది ఉండగా వీరిలో 9,966 మంది పురుషులు, 10,602 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలియచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీవో లలిత, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



అడవిదేవులపల్లిలో..

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓటర్ల జాబితా ప్రదర్శన

అడవిదేవులపల్లి : ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం ఎంపీటీసీలు, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వారీగా డ్రాఫ్ట్ ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితాను శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాతంగి రమేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రాఫ్ట్ ఫొటో ఓటర్ల, పోలింగ్ కేంద్రాల జాబితా ఎంపీడీవో కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. మండలంలో ఐదు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు మండలంలో మొత్తం 14వేల ఓటర్లు, 26 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు.

డ్రాఫ్ట్ ఫొటో ఓటర్ల, పోలింగ్ కేంద్రాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 8లోపు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ఎండీ మోసిన్‌బిన్ మహమ్మద్, ఏపీవో సూరానాయక్, పంచాయతీ కార్యదర్శి చింతల శ్రీనివాస్, ఇన్‌చార్జి ఈసీ రాధా, టీఏ వినోద్, తిరుపతి, ఎఫ్‌ఏలు మధు, హరి, మంగ్తా, చిన్న, రామ్మూర్తియాదవ్ తదితరులు ఉన్నారు.

జీఎస్టీ 2.0 పేదలకు మేలు

● దేవరకొండలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేసి మాట్లాడుతున్న వెంకటేష్‌యాదవ్

దేవరకొండ, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వ తీసుకురానున్న జీఎస్టీ 2.0తో పేదలకు మేలు జరుగుతుందని బీజేపీ జిల్లా నాయకుడు నక్క వెంకటేష్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్ అన్నారు. జీఎస్టీ శ్లాబ్ రేటు తగ్గించనున్నట్లు ప్రకటనపై హర్షం వ్యక్తం చే స్తూ ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ దేశ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు నేతాళ్ల వెంకటేష్, ఈదం రవికుమార్, నాగేంద్ర, బిక్కునాయక్, సహదేవుడు, సైదులు పాల్గొన్నారు.

ధాన్యం బోనస్ బకాయిలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌నాయక్

దామరచర్ల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యానికి సంబంధించిన వెంటనే బోనస్ డబ్బులు ప్రభుత్వం విడుదల చేయాలని సీపీఎం మం డల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్ అన్నారు.మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలోఆయన మాట్లాడారు. ఇప్పటివరకు రైతులకు ప్రభుత్వం బోనస్ డబ్బులు ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మళ్లీ వర్షాకాలంలో పంటలు వేయడానికి రైతులు బయట ప్రైవేట్ వ్యక్తుల నుంచి అప్పు తీసుకరావాల్సిన పరిస్థితులు ఏర్పడి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో ద యానంద్, పాపానాయక్, ఎర్రనాయక్, కోటిరెడ్డి, ఖాజా మోహిద్దిన్, సుభాని పాల్గొన్నారు.

రాధాకృష్ణన్ జీవితం స్ఫూర్తిదాయకం



ఉపాధ్యాయ దినోత్సవంలో గురువులను సన్మానిస్తున్న విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఎస్ఆర్ డీజీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల జోనల్ ఇన్‌చార్జి స్నేహలత మాట్లాడుతూ రాధాకృష్ణన్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ జానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో చింత విత్తనాల సేకరణ



చింతపండు నుంచి సేకరించిన చింతగింజలు

మిలియన్ విత్తనాల సేకరణే లక్ష్యంగా అడుగులేస్తున్న పర్యావరణ ప్రేమికులు అవిరెండ్ల సందీప్ తన మిత్రులతో కలిసి మొక్కల పెంపకానికి మొక్కవోని దీక్షతో పనిచేస్తున్నాడు. చిత్తశుద్ధి చింత విత్తనాలైనా మేలంటూ ఈ తరం యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు అందించిన పులిహోర ప్రసాదంలో వినియోగించిన చింతపండులోని గింజలను సేకరించి విత్తనాభివృద్ధి చేయడం విశేషం. (ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ టౌన్)

ఆర్థిక సాయం

డిండి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): డిండి మండల కేంద్రానికి మారుపాకల నర్సమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. దీంతో నర్సమ్మ కూతురు వినోదకు మండలకేంద్రానికి చెందిన యువత శనివారం రూ.10వేల నగదు అందజేశారు. బొల్లే శైలేజ్, శ్రీనివాస్ గౌడ్, ఏటి కృష్ణ, ఎం.ఎ.కయూం, పున్న దినేష్ తదితరులు ఉన్నారు.

గణపయ్యకు ఘనంగా వీడ్కోలు



కొండమల్లేపల్లిలో గణేష్ శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): తొమ్మిదిరోజుల పాటు ఘనమైన పూజలందుకుని బుధవారం గణనాథులు కృష్ణమ్మ ఒడికి చేరారు. ఉమ్మడి మండల వ్యాప్తంగా సుమారు 100 పైగా గణపతి విగ్రహాలు ఏర్పాటు చేశారు. డప్పుచప్పుళ్ల మధ్య యువతీ యువకులు, చిన్నారులు నృత్యాలు చేస్తూ నిమజ్జనానికి తరలించారు. మండలంలోని రంగారెడ్డిగూడెం రామాలయం వద్ద గణేష్‌ని లడ్డూను వేలం పాటలో రూ.64,116 రూపాయలకు వద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి-జ్యోతి దంపతులు సొంతం చేసుకున్నారు. అంగడిపేట ఎక్స్‌రోడ్డు రూ.52,000 శ్రీనివాస్‌రెడ్డి, గుడిపల్లి మండలకేంద్రంలో రూ.40,116 విడియాల బిక్షమయ్య-లక్ష్మీ దంపతులు, సింగరాజుపల్లిలో రూ.28 వేలు పోతిరెడ్డిపల్లిలో రూ.23 వేలకు లడ్డూ దక్కించుకున్నారు.

● కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో తిరుమలనగర్‌లో నిర్వహించిన గణేష్ నిమజ్జనంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొన్నారు. అలాగే నల్లగొండ రోడ్డులో ఎస్‌పీఎల్ క్రికెట్ టీమ్ ఏర్పాటు చేసిన భారీ గణనాథుని శోభాయాత్ర కనుల పండువగా సాగింది. కార్యక్రమంలో పస్నూరి యుగేందర్‌రెడ్డి, గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, జటమోని యాదయ్య, కర్నాకర్ పాల్గొన్నారు.

● చింతపల్లి : మండలంలోని ఘడియాగౌరారంలో గణపతి వద్ద ఎస్ఐ రాంమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం ఎస్ఐ ప్రారంభించారు. కమిటీ ఎస్ఐని శాలువాతో సన్మానించింది. కార్యక్రమంలో ఉజ్జిని విద్యాసాగర్ రావు, మాజీ ఎంపీటీసీ జక్కుల వెంకటయ్య, తంగిళ్ల శ్రీనివాస్‌లు, ఉజ్జిని అంజల్ రావు, ఎస్‌కే.జానీ, పాల్గొన్నారు.

● మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని పలు కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను శనివారం నిమజ్జనానికి తరలించారు. హనుమాన్‌పేట, శాంతినగర్, సీతారాంపురలలో నిర్వహించిన నిమజ్జన కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాగా హనుమాన్‌పేటలో మట్టి విగ్రహ ఏర్పాటుతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించిన ఎన్ఆర్ఐలు ఉమాప్రవీణ్, రమలకు ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాలలో బీజేపీ మహిళా నాయకురాలు చిలుకూరి రమాదేవి, నీరుకంటి సావిత్రి, నారాయణ, శివ, వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, వీరన్న, రామారావు పాల్గొన్నారు.

● నిడమనూరు : మండలంలోని వివిధ గ్రామాల్లో గణపయ్య విగ్రహాలను శనివారం ఘనంగా నిమజ్జనం చేశారు. ముప్పారం, సోమారిగూడెం, నిడమనూరు తదితర గ్రామాల్లో అందంగా అలంకరించిన వాహనాలపై విగ్రహాలనుఊరేగింపు నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా ఆయా గ్రామాల్లో వినాయక శోభాయాత్ర భక్తుల కోలాటాలు, భజనలు, భక్తి పాటలు, బాణాసంచా పేలుళ్ల నడుమ కనుల పండువగా సాగింది. జైగణేష్ మహారాజ్‌కీజై అంటూ యువకులు కేరింతలతో నృత్యాలు చేశారు. శోభాయాత్ర అనంతరం సమీప చెరువులు, నాగార్జునసాగర్ ఎడమ కాల్వలో వినాయక విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు.



గుడిపల్లిలో రూ.40,116 లడ్డూ దక్కించుకున్న విడియాల భిక్షమయ్య-లక్ష్మి దంపతులు



నిడమనూరు: ముప్పారంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



మిర్యాలగూడ నిమజ్జన పూజల్లో పాల్గొన్న భక్తులు

పరిషత్ ఓటర్ల సవరణ షురూ

(5వ పేజీ తరువాయి)

ఖరారు చేసేందుకు పంచాయతీరాజ్‌శాఖ సిద్ధమైంది. జిల్లా పరిషత్ అధ్యక్ష పదవికి రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్లు ఖరారు చేయనుండగా, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు జిల్లా యూనిట్‌గా రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. అదేవిధంగా మండలం యూనిట్‌గా ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు కేటాయిస్తారు. జడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు రిజర్వేషన్ల కోటాను రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ నిర్ణయిస్తే, స్థానాల కేటాయింపును కలెక్టర్ నేతృత్వంలో ఖరారు చేస్తారు. ఎంపీటీసీ స్థానాలకు కోటాను కలెక్టర్ల నేతృత్వంలో ఖరారు చేస్తే, స్థానాల కేటాయింపును ఆర్డీవోల నేతృత్వంలో చేస్తారు. 2011 ఆధారంగా జిల్లాలో ఆయా మండలాల్లో ఏ రిజర్వేషన్ వస్తుందనే అంశంపై ఇప్పటికే రాజకీయ నాయకులు అంచనాలతో లెక్కలు వేసుకుంటున్నారు. జడ్పీ ఛైర్మన్ పదవి ఏ వర్గానికి రిజర్వ్ అవుతుందనే అంశంపైనా, ఆ పదవిని ఆశించే వివిధ సామాజికవర్గాలకు చెందిన కీలక నాయకులు చర్చలు జరుపుతున్నారు. రిజర్వేషన్లు తేలితే బరిలో దిగేందుకు నాయకులు రంగం సిద్ధం చేసుకొని ఉండడంతో అన్ని మండలాల్లో, గ్రామాల్లో ఎక్కడ చూసినా దీనిపైనే చర్చ సాగుతోంది.

జడ్పీటీసీ స్థానం	ఎంపీటీసీ స్థానాలు	పోలింగ్ స్టేషన్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం
అడవిదేవులపల్లి	5	26	7340	7334	0	14,674
అనుముల	8	45	11588	12207	1	23796
చందంపేట	9	64	15768	14910	1	30679
చండూరు	8	43	12137	12186	0	24323
చింతపల్లి	14	85	22418	22633	3	45054
చిట్యాల	12	60	17760	17975	0	35716
దామరచర్ల	14	78	20179	20732	3	40914
దేవరకొండ	11	65	17909	17806	1	35716
గట్టుప్పల్	5	27	7832	7785	0	15617
గుడిపల్లి	5	24	6066	6205	0	12271
గుండ్లపల్లి	13	78	20660	20863	2	41525
గుర్రంపోడు	12	74	18947	19623	1	38571
కనగల్	12	67	18313	18579	0	36892
కట్టంగూరు	13	63	18565	18797	0	37362
కేతేపల్లి	11	55	15136	15947	1	31084
కొండమల్లేపల్లి	9	53	14992	14604	3	29599
మాడుగులపల్లి	10	56	14837	15686	0	30523
మర్రిగూడ	10	51	15146	15639	0	30785
మిర్యాలగూడ	19	99	27130	28042	8	55180
మునుగోడు	13	69	18990	19048	0	38038
నకిరేకల్	9	47	13283	13558	2	26843
నల్లగొండ	13	67	19166	20063	0	39229
నాంపల్లి	11	68	17886	18524	1	36411
నార్కట్‌పల్లి	15	83	21508	22263	1	43772
నేరేడుగొమ్ము	6	45	10304	9955	3	20262
నిడమనూరు	13	65	17516	18577	1	36094
పీఏపల్లి	10	51	13848	13790	6	27644
పెద్దవూర	11	62	16921	17564	9	34494
శాలిగౌరారం	13	70	19937	20448	3	40388
తిప్పర్తి	9	48	13468	14222	0	27690
తిరుమలగిరిసాగర్	11	64	17381	17690	4	35075
త్రిపురారం	12	66	17963	18732	3	36698
వేములపల్లి	7	38	9966	10602	0	20568
మొత్తం	353	1956	530860	542589	57	1073506

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

చింతపల్లి :ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు ఎంఈవో ఎన్.అంజయ్య తెలిపారు. ఉపాధ్యా య దినోత్సవాన్ని పురస్కరించుకొని వేంకటేశ్వరనగర్ జడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఎండీ.అన్వర్, కుర్మేడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న భర్త ఫర్జానాను శనివారం సన్మానించారు. భార్యాభర్తలిందరిని జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. వీటీ.నగర్, కుర్మేడ్ జడ్పీహెచ్ఎస్‌లో ఇద్దరిని పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్థులు శాలువా తో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కృష్ణమ్మ, అనంత్ రెడ్డి, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.



చింతపల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో

● నాగార్జునసాగర్, : నాగార్జునసాగర్ హిల్‌కాలనీ బీసీ గురుకుల పాఠశాలలో గణితశాస్త్రం టీజీటీగా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రాజు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణా అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీసీ గురుకులాల సెక్రటరీ సైదులు పాల్గొన్నారు. రాజుకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి అవార్డు అందుకుంటున్న రాజు

నారయ్య మృతి సీపీఐకి తీరని లోటు

డిండి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ వడ్డెమాను నారయ్య(80) మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. ఖానాపూర్ గ్రామానికి చెందిన నారయ్య వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. శనివారం స్వగ్రామంలో అంత్య క్రియలు నిర్వహించారు. నారయ్య మృతదేహంపై సీపీఐ నాయకులు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యు డు పల్లా నర్సింహరెడ్డి, బొడ్డుపల్లి వెంకటరమణ, బుచ్చిరెడ్డి, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.మైనొద్దిన్, సీపీఐ మండల కార్యదర్శి ఎస్‌ఆర్.కనకచారి, దొంతినేని వెంకటేశ్వరరావు ఉన్నారు.



నారయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జర్నలిస్టు భాస్కర్‌కు ప్రముఖుల నివాళి



భాస్కర్ మృతదేహానిరి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు దండ భాస్కర్ మృతికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భాస్కర్ పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కు టుంబ సభ్యులను పరామర్శించి తక్షణ సాయంగా రూ. 50వేలు అందజేశారు. భాస్కర్ మృతికి మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు సంతాపం తెలిపారు. భాస్కర్ మృతి తనను ఎంతో బాధించిందని మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు అన్నారు. ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి భాస్కర్ కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. కాగా సోషల్ వర్కర్ డాక్టర్ జాడిరాజు, ప్రజా సైన్స్ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మువ్వ రామారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, విద్యావంతుల వేదిక అధ్యక్షులు అంబటి నాగయ్య, భాస్కర్ మృతి పట్ల సంతాపం తెలిపారు. కాగా భాస్కర్ నేత్రాలను కుటుంబ సభ్యుల అంగీకారంతో డైమండ్ నేత్రనిధి ప్రతినిధులు సేకరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, ముక్కపాటి వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు బాధ్యత ఇతరులకు అప్పగించొద్దు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు నిర్వహణ బాధ్యతను అన్యమతస్తులకు అప్పగించొద్దని బీఆర్ఎస్ మైనార్టీ విభాగ పట్టణ అధ్యక్షుడు ఎంఏ.రెహమాన్‌ఖాన్ అన్నారు. పార్టీ కార్యాలయం లో శనివారం మాట్లాడుతూ వక్ఫ్ అమెడ్మె ంట్ యాక్టు 2025 ప్రకారం జీవో నంబరు 76ను రద్దు చేయడంతో పాటు, వక్ఫ్ బోర్డు నిర్వహణ బాధ్యతను అన్యమతస్తులకు కట్టబెట్టే దిశగా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవడం తగదన్నారు. ఆయా అంశాలను నిరసిస్తూ రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ము ట్టడి నిర్వంచనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముస్లింల పట్ల చిత్తశుద్ధి లేదని, మైనార్టీలను ఓట్లు వేసే యంత్రాలుగా వాడుకుంటుందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మైనార్టీ, విద్యార్థి విభాగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.